ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

57351

స్నేహ

నవంబర్ 9, 2008

బహుదేశాలలో

బాలల పండుగ

హ్యాపీబర్త్‌డే

(2008 నవంబర్-9 నుంచి
2008 నవంబర్-15 వరకు)

జి. స్వరూప్
8సం॥, నవంబర్-2000
రాధ-జగన్నాథం
చౌదంతివలస- విజయనగరం

జి. రాజేశ్వరి
6సం॥, నవంబర్-2002
రాధ-జగన్నాథం
చౌదం తివలస- విజయనగరం

డి. సాయిరాజ్
6సం॥, నవంబర్-13
రజని-రాజేష్
కంచరపాలెం-విశాఖపట్నం

టి. భగత్
2సం॥, నవంబర్-13
ఇందిర- బాబు
కురవి-వరంగల్

చరిష్మా శ్రీజ
5సం॥, నవంబర్-13
రోజారాణి-విమలా శంకర్‌దాస్
ఆరిలోవ-విశాఖపట్నం

టి. అపర్ణస్వాతి
1సం॥, నవంబర్-2007
స్వరూప-పాపారావు
ఎం. వెంకటాయపాలెం-ఖమ్మం

కేదార్‌నాథ్
నవంబర్
శోభ-తిరుపల్
పెద్దపాడు-కర్నూల్

అభినవ నికితా చౌదరి
5సం॥, నవంబర్-2003
పుష్ప-శ్రీనివాస్
నూతనకల్-ఖమ్మం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అంటించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివారాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్.

బాల్యాన్ని ఆస్వాదిద్దాం!

కొన్త సందు దొరికితే చాలు, మనలో చాలామందిమి 'అప్పట్లో...', 'ఆ రోజుల్లో...' 'ఆహా... ఓహో...' అంటూ గతాన్ని ఘనంగా కలవరిస్తాం. హాయినీ, ఆనందాన్నీ పలవరిస్తాం. ఇప్పటి 'నేడు' రేపటికి 'గతం' అవుతుందన్న వాస్తవాన్ని ఆ కొద్దిసేపూ మరిచిపోయి- 'ఆ రోజులే రోజుల'ని తెగ మురిసిపోతాం. ఇప్పడా సంతోషాలు లేవని, ఇంకెప్పడూ రావని తీర్మానించేస్తాం. తలపులకు యూజర్ ఛార్జీల బెడద లేదు కాబట్టి- ఈ తరహా ఫ్లాష్‌బ్లాకులు ఎన్నయినా తవ్వుకోవొచ్చు! మనుషులు తరచూ తడిమి చూసుకునే గతంలో 'యవ్వనం' అగ్రస్థానంలో ఉంటే- తరువాతి స్థానం బాల్యానిదట! బాధ్యతల బరువులేని బాల్యం నిజంగా బంగారం లాంటిదే! నవ్వొస్తే నవ్వుకోవొచ్చు.. ఏడుపొస్తే ఏడవొచ్చు.. అరమరికలూ, ఎవరో ఏదో అనుకుంటారని అనుకొని అనుభూతులను ఆపుకోవడాలూ బాల్యానికి వర్తించవు. చేయాలనుకున్నట్టే చేయటం కన్నా స్వేచ్ఛ ఇంకేం ఉంటుంది?

పిల్లలది స్వచ్ఛమైన మనసు, స్వేచ్ఛ ఉన్న వయసు. మెరుపు మెరిసినా, వాన కురిసినా అంతా తమకోసమేనని ఆనందిస్తారు. లోకమంతా తమకేనని, లోకం నిండా తామేనని అనుకుంటారు. బాల్యమంటే ఏళ్లలో లెక్కించే యాంత్రిక కొలమానం కాదు. ఒక వయసుకే పరిమితం చేసే ఒంటరి కాలమానమూ కాదు. బాల్యం ఒక అనుభూతి.. బాల్యం ఒక మధుర స్మృతి! బాల్యం చిరంజీవి!

కానీ, పీత బాధలు పీతవన్నట్టు- బాల్యం ఎందరికో బందిఖానా.

వీధుల్లో, ఇటుకబట్టీల్లో, క్వారీల్లో, కాఫీ హోటళ్లలో, రోడ్ల పక్కనా, రైళ్లలో... ఎక్కడ చూస్తే అక్కడ వేలాది చిట్టి చేతులూ పిడికెడు మెతుకుల కోసం బతుకు సమరం సాగిస్తున్నాయి. విశాల భారతంలో ఇలాంటివారి సంఖ్య ఇరవై లక్షలకు పైనే! మరోపక్క అమ్మానాన్నల అనురాగం పొందుతూనే- బండెడు 'భవిష్యత్తు'ను మోస్తున్న పిల్లలెందరో! మాటలే రాని తరుణంలో కాన్వెంట్లు, ఆటలాడే సమయంలో ప్రైవేట్లు.. బాల్యపు మొగ్గ విరియకముందే భవితవ్యపు కత్తి గాట్లు!

ఆంక్షలూ, కాంక్షలూ మనల్ని, మన పిల్లల్నీ బాల్యంనుంచి వేరు చేస్తాయి.

వాటిని ఎంత వీలైతే అంత దూరంలో పెట్టి చూడండి. ఎప్పడు కావాలనుకుంటే అప్పడు బాల్యంలోకి వెళ్లిపోవొచ్చు, మన పిల్లల ద్వారా. మనం మధురం అనుకున్న బాల్యాన్ని మన పిల్లల్నీ అనుభవించనిద్దాం. పిల్లల్లో పిల్లలమై మనమూ ఆస్వాదిద్దాం. బాల్యం ఎక్కడికీ పోదు. ఎప్పటికీ అదృశ్యం కాదు. గతంలోకి జారిపోదు. కోపమెరగని సహనం, స్వార్థం లేని సహాయం మనసునిండా ధరిస్తే- పిల్లల ప్రపంచంలోకి హాయిగా ప్రవేశించవచ్చు. నవ్వులు రువ్వే పూపరిమళాల మధ్య హాయిహాయిగా విహరించవచ్చు!

బాల్యాన్ని ఆహ్వానిద్దాం మన పిల్లల ద్వారా మనలోకి!

బాల్య మాధుర్యాన్ని చవి చూపిద్దాం చేతల ద్వారా లోకానికి!!

ooo

ఈ సంచికలో....

టపా	...	2
మంచి పుస్తకం	...	4
విజ్ఞాన వీచిక	...	8
రుచి	...	9
కవిత్వమ్	...	10
ఆరోగ్యం	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
మనసా... తెలుసా	...	17
లాహిరిలో	...	20
చూద్దామా	...	22

ఇంకా...

క్రైమ్ కథ... 3

వలకు చిక్కిన నేరగాళ్లు



సినిమా కబుర్లు ...6

బాలతారలుగా వచ్చి...

కథ ... 18

హద్దు



కథ ముగింపు మరోలా వుంటే బావుండేది

50 వేల డాలర్ల బుకర్ ప్రైజ్ మన భారతీయుడైన అరవింద్ అడిగాకు దక్కడం మనందరికి గర్వకారణం. తెల్ల పులి నవలకు అవార్డు దక్కినందుకు సంతోషం. బుకర్ ప్రైజ్ చరిత్ర తెలియజేసినందుకు ధన్యవాదాలు. రిక్షా సూరిగాడు కథ వాస్తవ జీవితానికి ప్రతిరూపం. కానీ ముగింపు సరిగాలేదు. పోలీస్ దమన కాండను క్షమించాడు. సామాన్య పోలీసే కావచ్చు. కానీ అతని చర్య ఖాకీ పాశవిక దమన కాండకు ప్రతీక. పోలీసులను క్షమించడం అంటే వారి నేరాలను అంగీకరించి మద్దతు తెలియజేయటమే. మరల పోలీసులు నేరాలు చేయటానికి అనుమతించడటం సరికాదు. వారు శిక్షించబడాలి. కర్మసిద్ధాంతం పనికిరాదు.

టి. శ్రీరామమూర్తి, విశాఖ.

రంగుల్లో వస్తే బావుండు

ప్రజాశక్తి నిర్వాహకులకు నమస్సుమాంజలి. టపా పాఠకుల అభిప్రాయాల శీర్షిక బాగుంది. మనసా తెలుసా శీర్షిక మంచిగా వుంది. చూద్దామాలో కొత్త కొత్త ఊళ్ల గురించి తెలుసుకుంటున్నాము. శీర్షికలన్నీ బాగుంటున్నాయి కానీ కొన్ని పేజీలైనా రంగుల్లో వస్తే బాగుంటుంది. అలాగే మహిళల కోసం కూడా ఒక శీర్షిక ఉంటే బాగుండేది.

అమ్మిన బాలరాజు, ఖమ్మం.

నిజంగానే వెలుగుల పండుగ

అనేక విశ్వాసాలతో ముడిపడివున్న వెలుగుల పండుగైన దీపావళి విశేషాలను వివరించిన కవర్ స్టోరీ ఎంతో ఆకట్టుకుంది. టపాసుల ధర ఆకాశాన్నంటేలా ఉన్నా ఖర్చుకు వెనుకాడకుండా తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ జరుపుకునే పండుగ దీపావళి. టపాసులు కాల్చేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా వివరించటం సందర్భోచితంగా ఉంది. అలాగే బేలూరు, హలిబీడులోని శిల్ప సంపద గురించి చూద్దామా శీర్షిక ద్వారా తెలియజేసినందుకు చాలా ఆనందంగా ఉంది. శరీరంలోని హార్మోన్ల పనితీరులో అసమానతల వల్ల వచ్చే సమస్యలు, వాధ్యులను గురించి మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రతి తల్లిదండ్రులకీ అర్థమయ్యే రీతిలో ఆరోగ్యంలో వివరించడం అభినందనీయం. అలాగే బుకర్ ప్రైజ్ గురించి తెలుసుకుందామాలో, జపాన్ ఆశాకిరణం అకిరా గురించి లాహిరిలో తెలిపినందుకు ధన్యవాదాలు.

గొల్లమందల సురేష్ కుమార్, సీతారాంపురం.

కథ చక్కగా వుంది

దీపావళి అంటే దీపాల వరుస. అంటే వెలుగుల పండుగ. అంటే పరవశం. ఈ మాసం బాణాసంచా సామాగ్రి ధరలు విపరీతంగా పెరిగి వ్యాపారులకు వినియోగదారులకు నెత్తిమీద కుంపటిగా మారింది. రాజకీయ నాయకులు ఊరిలోకి వచ్చినప్పుడు, పెళ్లి సంబరం జరిగినప్పుడు, ఒకమనిషి చచ్చిపోయినప్పుడు ఇలా అనేక సందర్భాల్లో బాణాసంచాలు కాల్చడం మామూలే. కుటుంబ సభ్యులతో, సరదాగా జరుపుకునే పండుగ దిపావళి. అయితే దీపావళి సామాగ్రి తయారు చేసిన వారు మంచి లాభాలు పొందారు. మధ్య తరగతి వారు నిరాశతో మిగిలారు. జీవితంలో మరువలేని పండుగగా దీపావళిని చెప్పుకోవచ్చు. దీనికి సంబంధించి ఇచ్చిన అట్టమీది కథ బావుంది. చూద్దామాలో ప్రకృతి అందాలతో అబ్బుర పరచిన వర్ణచిత్రాలు గోపురం మీద ఉన్న బొమ్మలు, శిల్పాలు చాలా చక్కగా ఉన్నాయి. ఈ వారం రిక్షా సూరిగాడు కథ బాగుంది. బతుకు జీవనం కోసం రాత్రింబగళ్లు రిక్షా తొక్కే పేదవాడి బతుకుతో ఆడుకుంటున్న పోలీసుల గురించి చాలా చక్కగా చెప్పారు. తమ అవసరాల కోసం రిక్షావారిని పొట్టన పెట్టుకుంటున్నారు. రోడ్ల మీద కార్లు పెట్టినా పర్వాలేదు. ఎందుకంటే లంచం ఇస్తారు గనుక. అదే రిక్షా సూరిబాబు లాంటి పేదోడు ఇవ్వలేడు కాబట్టి ఇలాంటి పోలీసులకు సరైన బుద్ధి చెప్పాలి. ఇంకోసారి రిక్షా కార్మికుడు జోలికి రారు. ఈ కథ అందించిన తీరు చాలా బాగుంది. రచయితకు ధన్యవాదాలు. సమ్‌థింగ్ స్పెషల్ విశేషాలు, ఆకర్షణీయంగా ఉన్నాయి. గుమ్మడి పండు పదవల పోటీలు ఆకర్షణీయంగా ఉన్నాయి. సాహిల్ అందించిన 'టిమున్ తెలివి' కథ బావుంది. ఈ వారం స్నేహకి అభినందనలు.

-అనుపోజు సత్యనాగరాజు, రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

నవ్వుల్-పువ్వుల్

గిఫ్టు

సోనీ: అమ్మా! టీచర్స్ డే రోజున మేమంతా కలిసి టీచర్లకు గిఫ్టులిస్తాంకదా.

తల్లి: అయితే...

సోనీ: మరి చిల్డ్రన్స్ డే రోజు టీచర్లంతా కలిసి మాకు గిఫ్టులెందుకు కొనిపెట్టరమ్మా...!

కె.సాహిల్, 6వ తరగతి, గౌతమ్ మోడల్ స్కూల్, హైదరాబాద్.





క్రైమ్ కథ

వలకు చిక్కిన నేరగాళ్లు

"రెండేళ్లక్రితం గ్రామదేవత జాతరలో హత్య జరిగింది. హంతకుడి ఆచూకి నేటికీ లభించలేదు. చాలామందిని అనుమానించాం. రెండు టీములు పని చేసినా కనీసం చిన్న క్లూ కూడా మనకు లభ్యంకాలేదు.ఆ కేసు దాదాపు ఎల్‌పి(లాంగ్‌పెండింగ్)లో పెట్టేసింది మన డిపార్టుమెంటు. నేను బదిలీమీద వెళ్లేలోగా దోషులను పట్టుకుంటానని అధికారులకు ప్రామిస్‌చేశాను. వచ్చేనెలలో నాబదిలీ తప్పదు. ఈనెలలో జాతర అవుతుంది. వున్న ఐకే ఒక అవకాశం మీరంతా సహకరించి దోషులను పట్టుకోవాలని ఆశపడ్తున్నాను"

యర్నాగుల సుధాకరరావు

"సార్ నాకు ఆ ఫైలు ఇప్పించండి. నేను సాధ్యమైనంత వరకు నా ప్రయత్నం చేస్తాను. అనుకున్నట్టు నా గాలానికి చిక్కిపోతే దోషితో మీ ముందుంటాను. మీమాట చెల్లుబాటు అవుతుంది" రాహుల్ నమ్మకంగా చెప్పి ఫైలు వైపు చూశాడు.

"లోగడ నీవు కొన్ని మిస్టరీలు ఛేదించావు. నీమీద నమ్మకం ఉంది. నువ్వన్నట్టు నీగాలానికి చిక్కితే కాదు నేరగాళ్లను నీవు వలవేసి పట్టుకోవాలి. అంతేగాని చేతులెత్తేయకూడదు. అప్పుడు నామాట చెల్లుబాటు అయినట్లే" డి.యస్.పి దృఢచిత్తంతో చెప్పి ఫైలు అందించాడు.

రాహుల్ అర్ధరాత్రి వరకు ఫైలు అంతా క్షుణ్ణంగా పరిశీలించాడు. నిద్ర ముంచుకొస్తే నిద్రలోకి జారుకున్నాడు. పడుకున్నాడే కాని రాత్రంతా తాను జాతరలో తిరిగి పరిశోధిస్తున్నట్టు ఒకటే కలలు. ఉదయం తలనొప్పితో లేచాడు. తలాతోకాలేని కలలు రన్నింగ్‌లో ఉంటే తలనొప్పి తప్పదని తనకు తానే సమర్థించుకున్నాడు.

ఇంతకీ చనిపోయిన యువతి గురించి మరోసారి ఫైలులో చూశాడు. ముప్పై ఏళ్లుండే నీలూ ఒక దాబా యాజమని భార్య. మెడలో ఐదు తులాల గొలుసు వేసుకుని ఎర్రరంగు చీరలో ఆరోజు మెరిసిపోయింది. తనతోబాటు దాబాలో పనిచేసే రోషిణి అనే అమ్మాయిని తీసుకుని వచ్చింది. జాతరలో ఇద్దరూ జనాల తొక్కిసలాటలో విడిపోయారు. ఆతరువాత మరి కలవలేదు. ఇదే విషయం రోషిణి చెప్పినట్లు పోలీసులు రికార్డు చేశారు.

రాహుల్ ఒకటిరెండుసార్లు ఫైలు క్షుణ్ణంగా చదివాడు. తనకు తోచిన విధంగా ఒక పథకం వేశాడు. అది ఎవరికీ చెప్పకుండా అమలుచేశాడు. పదిరోజుల తరువాత జాతర ప్రారంభమైంది. జనాలు భారీగా వచ్చారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పెద్ద సంఖ్యలో మొహరించి జాగ్రత్తపడ్డారు.

జాతరలో యువతీయువకులు తుళ్లింతలు కేరింతలతో హడావుడిగా ఉన్నారు. ప్రేమికులు చెట్టాపట్టాలేసుకుని తిరుగసాగారు. వారిలో ఒక అందమైన యువతి సెల్‌చేతిలో పట్టుకుని ఏవో వస్తువులు కొనుగోలుచేసి వాటిని తనవెంట తెచ్చుకున్న మరో అమ్మాయికి ఇచ్చి మోయించుకుంటూ నడవసాగింది. ఆమె వెంట కొంతమంది అబ్బాయిలు పడ్డారు. వారి కామెంట్లకు ధీటుగా బదులిస్తూ ముందుకు చకచకా సాగి పోయింది.

జాతర చూడడం అయ్యాక జీపెక్కి తానే స్టార్టు చేసింది. చాలామంది వింతగా చూశారు. అప్పుడే ఒక యువకుడు వచ్చి "మేడమ్ కాలు మడమ నలిగిపోయింది. వెనుక సీటులో కూర్చుంటాను. జామ్‌నగర్‌కు ముందే దిగిపోతాను" చెప్పి విలవిలలాడిపోయాడు. అతన్ని ఎగాదిగాచూసి కూర్చోమని సైగచేసింది.

జీపు జనాలను తప్పించుకుని రోడ్డు ఎక్కేసరికి గంటన్నర పట్టింది. జామ్‌నగర్‌కు వెళ్లే రోడ్డులోకి తిరిగింది. ఆరోడ్డు పై రద్దీ ఉండదు. అటువైపు అసలు పల్లెలు లేవు.అవన్నీ కొండలు అడవులు ఉండే ప్రాంతం. జీవు కొద్ది దూరం వెళ్లేసరికి చీకటి తెరలు చిక్కనవసాగాయి. అంతే వెనుకసీటులోఉన్న యువకుడు కత్తి ఆమె మెడకు తాకించి బలవంతంగా జీపు ఆపించేశాడు. ఇంతవరకు ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించిన ఆమె ఒక్కసారి డీలా పడిపోయి వణికిపోసాగింది. ఆమె మెడలో నగలు తీసుకున్నాడు. హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్ననోట్లు జేబులో పెట్టుకుని నవ్వుతూ చూసి "పెద్ద రౌడీ బిల్డప్ ఇచ్చావు. ఇప్పుడేమో ఇలా జావకారిపోయావు. ముందుంది ముసళ్లపండుగ" అని విజిల్ వేశాడు.



రోడ్డుపక్కనే ఉన్నతోటలో రెండు మోటార్ సైకిళ్లు కన్పించాయి. నలుగురు యువకులు వచ్చి ఆబగా చూడసాగారు. "వదిలేయండి. మీరు నా నగలు దోచుకున్నట్లు పోలీసులకు చెప్పను" అని ప్రాధేయ పడింది.

"ఇంత అందమైనదాన్ని ఎందుకు వదులుకోవాలి" అని ఆమె పైపడ్డారు. పక్కనే పీలగాఉన్న అమ్మాయిని కూడా వారు వదల్లేదు. వారిద్దరిని అరవకుండా నోళ్లు మూశారు. తప్పించుకునేందుకు పెనుగులాడసాగారు. కాళ్లావేళ్లా పడ్డారు. అయినా ఆ మృగాలకు అది మరింత వినోదమయ్యింది. రెచ్చిపోసాగారు.

సరిగ్గా ఆ సమయంలో చడీచప్పుడు కాకుండా వచ్చిపడ్డారు పోలీసులు. ఒక్కక్షణం ఆలస్యం చేయకుండా చుట్టుముట్టి పట్టుకున్నారు. నేరగాళ్లు తేరుకుని పిస్తోళ్లు తీసేసరికి వారిని కమ్మేశారు పోలీసులు. ప్రతిఘటించి లాభం లేదనుకుని బిక్కమొహాలు వేశారు. అయితే వారు అంత తేలిగ్గా లొంగి పోవడానికి కారణం వారు శృతిమించి మద్యం సేవించడంతో పోలీసులపై తిరగబడలేకపోయారు. నాలుగువైపులా పరుగులుతీసి తప్పించుకుని పారిపోలేకపోయారు. ఆయువతి ఎవరో తెలిశాక నిలువెల్లా వణికి పోయారు. ఆమె పొరుగుజిల్లాలో పనిచేసే మహిళా సబ్‌ఇన్‌స్పెక్టర్, ఆమెను రాహుల్ పిలిపించి పాతనేరగాళ్లను పట్టుకోవడానికి సహకరించమని చెబితే ఆమె ఆ పాత్రలో జీవించింది. రుచి మరిగిన నేరగాళ్లు పాత విధానంలో నేరం చేయబోయి దొరికిపోయారు. నేరాన్ని దాచకుండా ఒప్పుకున్నారు. జాతరలకు ఒంటరిగా వచ్చే యువతులను ఇలా ట్రాప్ చేసి వారివద్ద విలువైనవి దోచుకుని ఆపైన వారిపై అత్యాచారం చేయడం, గుట్టు బయటపడుతుంది అనుకుంటే ఏమాత్రం జాలి చూపకుండా చంపేయడం వారు చేస్తున్న నీచాతినీచమైన నేరాలు.

లోగడ జాతరకు వచ్చిన దాబా యజమాని భార్య నీలూ కూడా ఇలానే వచ్చి జాతరకు వచ్చి తిరిగి ఇంటిముఖం పట్టేటపుడు ఈనేరగాళ్ల జీపు ఎక్కింది. వారు ఎంతో సౌమ్యంగా మాట్టాడి ఆమెను ఎక్కేట్టుచేశారు. జామ్‌నగర్ రోడ్డులో తోటలమధ్యలో దించి నగలు దోచుకుని అత్యాచారం జరపబోతే ఆమె నేరగాళ్లమీదకు రాళ్లు రువ్వింది. దాంతో వారు ఆమెను పొడిచి చంపేసి శవాన్ని తోటల మధ్య వదిలిపారిపోయారు. ఆకేసులో నేరగాళ్లను పట్టుకోవడానికి ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఇప్పుడు ఇన్‌స్పెక్టర్ రాహుల్ వేసిన పథకంతో ఇలా పోలీసువలకు ఐదుగురు నేరగాళ్లు తేలిగ్గానే చిక్కిపోయారు.

మన రచయితల మనో 'గతాలు'

ఇంటర్వ్యూల ద్వారా పాఠకులకు ఆ రచయితల గురించి ఆసక్తికరమైన విషయాలు తెలియడం ఒక్కటే ఈ పుస్తకం ప్రయోజనం కాదు. సమాజంలో ప్రముఖులుగా పరిగణించబడే రచయితలు ఎన్ని కష్టనష్టాల మధ్య నిలదొక్కుకున్నారో కూడా అర్థమవుతుంది. ప్రజల పట్ల సాహిత్యం పట్ల వారి నిబద్ధత ఎంత ప్రగాఢమైందో తెలుస్తుంది. వీరెవ్వరూ బంగారు మేడల్లో పుట్టిన వారు కాదు. అందరూ పండిత వంశాల్లోంచి వచ్చిన వారూ కాదు. అందరి భావ పరిణామ క్రమం కూడా ఒకటి కాదు.తరతమ తేడాలున్నా అక్షరదీక్ష,ఆశయబలం వారిని నడిపించాయి. రచయితలు ఆకాశంలోంచి వూడిపడరనీ, అలాగే శాశ్వతంగా ఆకాశంలో వుండేవారు కాదనీ కూడా అర్థమవుతుంది. రచన చేయటం కేవలం కీర్తి ప్రతిష్టల కోసం కాదు, ప్రజలతో మమేకమై వారి భావ స్పందనలు అందుకోగలిగితేనే రచనలు ఫలప్రదం అవుతాయి. ఇందుకు అంతులేని సాధన సాగాలి. వేదన వుండాలి.



పీపీ

అక్షరాలతో అలరించే మంచి కవులు, రచయితలంటే అందరికీ అభిమానమే.వారి గురించిన విశేషాలు, వివరాల పట్ల చాలా ఆసక్తి వుంటుంది. వాస్తవానికి ఎవరికి వారు చాలాసార్లు తమ అనుభవాలను అక్షరబద్ధం చేయాలనే అనుకుంటుంటారు. అయితే ఎలా రాయడమా అని ఎడతెగని సమస్యలో పడిపోతుంటారు. నిజానికి ప్రసిద్ధులైన రచయితలు కూడా ఒక్కరోజులో తయారు కారు. దాని వెనక ఎంతో శ్రమ వుంటుంది. సాధన వుంటుంది. వేదన కూడా వుంటుంది. వారు స్వయంగా చెబితే తప్ప ఇతరులకు తెలియని చాలా విషయాలుంటాయి.ఇవన్నీ అర్థం కావడానికి ఒకే ఒక మార్గం వారి ఇంటర్వ్యూలు.మామూలు ఇంటర్వ్యూలు కళాసాహిత్య కారుల ఇంటర్వ్యూలకు తేడా వుంటుంది. అదే వారి రచనా రహస్యాలను గాకపోయినా దినుసులను వెల్లడిస్తుంది.

అలాంటి పదిమంది ప్రముఖ రచయితల ఇంటర్వ్యూలు ఒక చోట దొరకడం సాహిత్యాభిమానులకు కన్నుల పండగే. 'అక్షరాలు-అనుభవాలు' అనే ఈ 80 పేజీల పుస్తకం అందుకే పాఠకాదరణ పొంది మూడవ ముద్రణకు సిద్ధమవుతున్నది. ప్రజాశక్తి, సాహితీస్రవంతి ప్రచురించిన ప్రత్యేక సంచికలలో వచ్చిన పది ఇంటర్వ్యూలను ఈ పుస్తకంలో చూడగలుగుతాము.

తెలుగునాట ప్రామాణికంగా పరిగణించబడే రథ చక్రాలు, కొల్లాయిగట్టితేనేమి వంటి రాజకీయ చారిత్రిక నవలల రచయిత మహీధర రామమోహనరావు ఇంటర్వ్యూతో పుస్తకం మొదలవుతుంది. నిశిత పరిశీలనతోనే మంచి రచన సాధ్యమని ఆయన గట్టిగా చెబుతారు. నిబద్ధత లేకపోతే రచనకు ప్రయోజనమే లేదని స్పష్టం చేస్తారు.తను భాషను చాలా జాగ్రత్తగా వినియోగిస్తానని, ఒకో మాటను ఆలోచించి పదిసార్లు రాస్తానని చెబుతారు. అవంతీ ప్రచురణల ద్వారా మార్క్సిస్టు మూల గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తమ అనుభవాలను చెబుతూ గతితర్కం అన్నమాట మొదటి సారి తామే ప్రవేశపెట్టామని తెలిపారు. కమ్యూనిస్టు పత్రికల నిర్వహణలో తన అనుభవాలను, కష్టనష్టాలను వెల్లడించారు. వీర తెలంగాణా సాయుధ పోరాట యోధుల నుంచి ఆ కాలంలో సేకరించిన సమాచారమే 'ఓనమాలు' అన్న నవలకు ఇతివృత్తమైంది. కమ్యూనిస్టు సిద్ధాంతమే తనకు ప్రేరణ అయిందని, ప్రతి విషయానికి భిన్న కోణాలు వుంటాయన్న అవగాహనే నడిపించిందని చెబుతారు.

తర్వాతి ఇంటర్వ్యూలో రంగనాయకమ్మ తన జీవిత పరిస్థితులే తనను ఎలా రచనల వైపు నడిపించాయో చెప్పారు. ఆమె చిన్నతనం నుంచే బాగా చదివే వారు. వాళ్ల నాన్నకు తాడేపల్లి గూడెంలో ప్రెస్ వుండేది. అందులో అచ్చయ్యే పద్మనాయక అనే కులపత్రికలో 'రాక్షసుడు రాజకుమారుడు' వంటి 'పిచ్చి' కథలు రాసేవారు. పందొమ్మిదో ఏట 'కృష్ణవేణి' నవల రాశారు. ఇరవయ్యవ ఏట పెళ్లి చేసుకున్నారు. ఆమె మాటల్లోనే 'జీవితం అస్తవ్యస్తమై పోయింది. మనుషుల్లోంచి హఠాత్తుగా నరకంలో పడిపోయారు'. ఆ దు:ఖంలోంచి ఆమె సాహిత్యం ప్రారంభమైంది. జీవితానుభవాలు వింతగా కొత్తగా కనిపించడం మొదలైంది. అప్పుడు మనశ్శాంతి కోసం పేకమేడలు వంటి కథలు ప్రారంభించారు. స్త్రీలు అనుభవించే అవమానాలకు వ్యతిరేకంగా రాయాలన్నదే

లక్ష్యమైంది అంటారు. తన పాత్రలన్నిటికీ ఆధారాలున్నాయంటూ 'పేకమేడలు' లో భానుమతిని నేనే. రచయిత్రిలో విజయను నేనే.." అని చెప్పారు. 'స్వీట్‌హోం'లో విమల మాత్రం తన ఇరుగింటావిడట. 'బలిపీఠం' విషయంలోనైతే ఎవరో చెప్పిన కథ విని రాశారు గాని తర్వాత అది అబద్ధమని తేలింది. (అయితే దానివల్ల ఆ రచన విలువ తగ్గేదేమీ వుండదు) ఆమెకు బాగా నచ్చిన రచయితలు వీరేశలింగమూ,చలమూ. ఈ ఇంటర్వ్యూలోనే ఆమె తను మార్క్సిజంవైపు ఆకర్షితురాలైన తీరు, తద్వారా తన రచనా మార్గంలో వచ్చిన మార్పులూ, ఈ క్రమంలోనే గాంధీతో తన సహజీవనం తదితర అంశాలు అరమరికలు లేకుండా వివరించారు. అలాగే తన రచనల్లోని తర్కం, హాస్యం వంటి అంశాలను ఎలా అర్థం చేసుకోవాలో చెప్పారు. ఈ ఇంటర్వ్యూ పత్రికలో వచ్చినపుడు, పుస్తకంగా వచ్చాక కూడా పాఠకులను విశేషంగా ఆకట్టుకుంది. తన జీవితానుభవాలను ఆమె తొలిసారి సవివరంగా పాఠకులతో పంచుకున్న ఇంటర్వ్యూ ఇదే.

'నీకొచ్చిన భాషలో రాయి, నీ విముక్తి కోసం రాయి' అనే శీర్షికతో వున్న ప్రజాగాయకుడు గద్దర్ ఇంటర్వ్యూ కూడా విలక్షణమైంది. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన గద్దర్ చిన్నతనంలో తల్లి ప్రభావంతో జానపద గీతాలు నేర్చుకున్నారు. తండ్రి దగ్గర అంబేద్కర్ గురించి తెలుసుకున్నారు. చిన్నప్పటి నుంచి గ్రహణ, సృజన రెండూ ఎక్కువే. కళల్లో దూసుకుపోవడం వల్ల కుల వివక్ష పెద్ద సమస్య కాలేదు. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదివేందుకు వచ్చాక నిక్కష్టమైన జీవితం గడిపారు. సృజనశక్తి చచ్చిపోయినట్టనిపించింది. అప్పుడే నరసింగరావుతో పరిచయమైంది. ఆయన నడిపే 'ఆర్ట్ లవర్స్' అసోసియేషన్‌తో అవగాహన పెరిగింది.జానపద బాణీలలో పాటలు రాయడం మొదలెట్టారు. విమర్శలు ఎదుర్కొన్నా తర్వాత నిలదొక్కుకున్నానని చెప్పారు. అయితే ఆయన ఎప్పుడూ పాటలు రాయరు. అల్లుకు పోతారు. ఎవరి కోసం నిరీక్షించకుండా నీకొచ్చిన భాషలో నీ విముక్తి కోసం రాసుకుపోవాలన్నదే ఆయన తారకమంత్రం. అప్పటికి 3000 పాటలు రాశారు. భాష కూడా జాగ్రత్తగా వుండాలని, వాస్తవికతను వదిలిపెట్టి వ్యూహాత్మకంగా వెళ్లడం సరికాదని హెచ్చరిస్తాడు. పిల్లిపిల్ల మీద, ఫ్యాన్‌మీద తను కట్టిన పాటల గురించి వివరిస్తారు. తన రాజకీయాభిప్రాయాల గురించి కూడా చర్చించారు. ప్రజాకళల విషయమై మరింత అధ్యయనం, చర్చ జరగాలంటారు. కవిత్వం గొప్ప పాట గొప్ప వంటి వ్యర్థ వివాదాల కన్నా అన్నిటినీ ఉపయోగించుకోవాలని, వీలైన మేరకు కొత్త సాంకేతికతను కూడా పట్టుకోవాలని స్పష్టం చేస్తారు.

ప్రసిద్ధ కవులు సి .నారాయణ రెడ్డి, శేషేంద్ర శర్మ, వేగుంట మోహన ప్రసాద్, కె.శివారెడ్డి, తమ కవిత్వాలను జీవితాలను గురించి చెప్పిన విషయాలు కవితాత్మకంగానూ ఆలోచనాత్మకంగానూ సాగుతాయి. కవులుగా వారి ప్రత్యేకతల పునాదులు ఏమిటో ఈ ఇంటర్వ్యూలు విదితం చేస్తాయి. మొత్తంపైన వీరంతా ప్రజల పట్ల నిబద్ధత ప్రధానమంటారు. గ్రామాలలో తమమూలాలను నొక్కిచెబుతారు. సాహిత్యానికి సంబంధించి వారిపై వున్న విమర్శలు లేదా సందేహాలకు కూడా వీటిలో జవాబు లభిస్తుంది.వాటిని వివరంగా ప్రస్తావించడం కన్నా ఆసక్తి గల వారు స్వయంగా చదువుకోవడం బావుంటుంది.

ఇక ప్రముఖ కథకులు, నవలా రచయితలు దాశరథి రంగాచార్య, పెద్దిభొట్ల సుబ్బరామయ్యల ఇంటర్వ్యూలు కూడా బాగా ఆకట్టుకుంటాయి. పెద్దిభొట్ల మధ్యతరగతి నేపథ్యం ప్రధానంగా వుండే తన కథా శైలిని ఆర్ద్రంగా చెప్పారు. 'పెద్దిబొట్ల పాత్రలు చచ్చిపోతాయి. లేదా హాయిగా నిద్రపోతాయి' అని తన మీద చలోక్తి వున్న సంగతిని తనే ప్రస్తావించుకున్నారు. కథ చదివిన వారిలో ఒక ఫీలింగ్ కలిగించడం తప్ప అంతకు మించిన క్లిష్టమైన నిర్వచనం అనవసరమంటారు. తెలంగాణా పోరాట నవలలతో సహ ఎన్నో గొప్ప రచనలు అందించిన దాశరథి రంగాచార్య ఉద్యమాలే తనను రచయితను చేశాయంటూ ఇంటర్వ్యూ ప్రారంభించడం విశేషం.తను సంస్కృత కావ్యాల అధ్యయనంతో మొదలెట్టి మార్క్సిజం వరకూ పయనించిన క్రమాన్ని గుర్తు చేసుకున్నారు. ఇన్‌వాల్వ్‌మెంట్,డివోషన్ అన్నవే తన చిత్రణ అంత బలంగా వుండటానికి కారణమైనాయన్నారు. వేదాలు, రామాయణం రాసిన తాను ఇప్పుడు రాముడి పేరిట రావణ కాష్టం రగిలిస్తున్న రాజకీయ కుట్రలపై ఎంతో ఆగ్రహంగా వున్నట్టు చెప్పారు. తెలుగులో మంచి నవలలు రాలేదన్న వాదనను తోసిపుచ్చే దాశరథి కొడవటిగంటి నవలా కారుడే కాదని చెప్పడం కొంత విస్మయం గొల్పుతుంది. జీవితాన్ని సమాజాన్ని చదివి, నేర్చుకుని ఆ తర్వాత రాయాలని ఆయన సలహా.

సీనియర్ సంపాదకులు సి.రాఘవాచారి ఇంటర్వ్యూతో ఈ పుస్తకం ముగుస్తుంది. కవిగా, రచయితగా రచనలు వెలువరించకపోయినా సాహిత్యాన్ని అగాధంగా అధ్యయనం చేసిన మేధావి ఆయన.తన మేధా పరిణితి వెనక గల కుటుంబ నేపథ్యాన్ని వివరిస్తారు.మీడియాకు నిష్పాక్షికత గురించి మాట్లాడ్డం మిథ్య అంటారు. ప్రాచీన కాలంలోనైనా ప్రస్తుత దశలోనైనా ఉద్యమశీలత గల కవిత్వమే నిలబడిందని సోదాహరణంగా వివరిస్తారు.పోరాడాలంటే అన్ని తరగతుల వారిని వెంటతీసుకుపోవాలి అంటూ మగ్దూం కవిత 'చలేతో సారే జమానేకో సాత్ లే చలో' ఉదహరిస్తారు. వసుధైక కుటుంబం వంటి భారతీయ భావనలను మంత్రాల్లా వల్లించడం కాక ప్రపంచీకరణ యుగానికి తగినట్టు అన్వయించుకుని ముందుకు పోవాలంటారు. ఉర్దూ సంస్కృతం రెంటి గొప్పతనాన్ని వివరిస్తూనే నేటి భారతీయాంగ్ల సాహిత్యంలో సంచలనశీలత వున్నంతగా సామాజిక ప్రయోజనం లేదని స్పష్టం చేస్తారు.

ఇంటర్వ్యూల ద్వారా పాఠకులకు ఆ రచయితల గురించి ఆసక్తికరమైన విషయాలు తెలియడం ఒక్కటే ఈ పుస్తకం ప్రయోజనం కాదు. సమాజంలో ప్రముఖులుగా పరిగణించబడే రచయితలు ఎన్ని కష్టనష్టాల మధ్య నిలదొక్కుకున్నారో కూడా అర్థమవుతుంది. ప్రజల పట్ల సాహిత్యం పట్ల వారి నిబద్ధత ఎంత ప్రగాఢమైందో తెలుస్తుంది. వీరెవ్వరూ బంగారు మేడల్లో పుట్టిన వారు కాదు. అందరూ పండిత వంశాల్లోంచి వచ్చిన వారూ కాదు. అందరి భావ పరిణామ క్రమం కూడా ఒకటి కాదు.తరతమ తేడాలున్నా అక్షరదీక్ష,ఆశయబలం వారిని నడిపించాయి. రచయితలు ఆకాశంలోంచి వూడిపడరనీ, అలాగే శాశ్వతంగా ఆకాశంలో వుండేవారు కాదనీ కూడా అర్థమవుతుంది. రచనలు చేయడం కేవలం కీర్తి ప్రతిష్టల కోసం కాదు, ప్రజలతో మమేకమై వారి భావ స్పందనలు అందుకోగలిగితేనే రచనలు ఫలప్రదం అవుతాయి. ఇందుకు అంతులేని సాధన సాగాలి. వేదన వుండాలి. అవే లేకపోతే అంతా నిర్జీవమే.

ఇంటర్వ్యూలు చేసింది, సంకలనం వెలువరించింది తెలకపల్లి రవి అయినా అగ్రశ్రేణి రచయితల భావ స్రవంతి కావడమే దీనికి ప్రత్యేకతను సంతరింపచేసింది.

అక్షరాలు- అనుభవాలు
సాహితీ ప్రముఖుల ఇంటర్వ్యూలు
తెలకపల్లి రవి
ప్రచురణ: సాహితీ స్రవంతి
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి
హైదరాబాద్-20

ముదురు

తాతయ్య,
నాన్న, బాబాయి,
మామయ్యను చూసి
నేను కూడా...



సినిమా కబుర్లు

బాల తారలుగా వచ్చి...

సినిమా అన్నాక నవరసాలు వుంటాయి. వాటిని పండించేందుకు హీరోలు, హీరోయిన్లు, విలన్లు, కమెడియన్లు, బాల తారలు...అంతా వుంటారు. అమాయకంగా...ముద్దు ముద్దు డైలాగులతో పెన్నలను పెద్దలను అలరించే, కంట తడి పెట్టించే బాల తారల ప్రభావం సినిమా విజయం మీద చాలానే వుంటుంది. కేవలం వారివల్లే హిట్టయిన సినిమాలూ, వారి చుట్టూనే తిరిగే చిత్రాలూ వున్నాయి. అయితే చైల్డ్ ఆర్టిస్టుగా సినీ జనానికి పరిచయమై... యుక్తవయస్సు వచ్చాక హీరోహీరోయిన్లుగా పునఃప్రవేశం చేసి విజేతలైనవారూ ఎక్కువగానే కనిపిస్తారు. బాలీవుడ్‌లో ఇది బాగా కనిపిస్తుంది. మరి బాల తారలుగా వచ్చి బాలీవుడ్‌ను ఏలిన...ఏలుతున్న స్టార్స్ గురించి ఒక్కసారి ప్రస్తావించుకుందాం.


హృతిక్

అల కొమ్మాలపాటి

శశి కపూర్...

'దీవార్'లో 'మేరే పాస్ మా హై...' అన్న డైలాగ్ చెప్పిన శశికపూర్‌ను మనం ఎప్పటికీ మర్చిపోలేం. అది 1975లో సంగతి. కానీ దానికి చాలా ముందర అంటే కనీసం 30 సంవత్సరాల ముందు శశికపూర్ తన ఆరేళ్ల వయసులో జయంత్ దేశాయ్ చిత్రం 'తద్బీర్'లో నటించాడు. అప్పటినుంచి ' భక్త ధృవ, భక్త బైలవమంగళ్' వంటి అనేక పౌరాణిక చిత్రాల్లో బాల నటుడిగా కనిపించాడు. దానికీ ఒక కారణం వుంది. అప్పట్లో పౌరాణికాలే ఎక్కువగా వచ్చేవి. అయితే 'ఆగ్ (1948). 'ఆవారా' (1951) లో బాల నటుడిగా శశి చక్కటి ప్రతిభను ప్రదర్శించాడు. అందులో రాజ్ కపూర్ చిన్నప్పటి పాత్ర పోషించాడు. ఆ తర్వాత హీరోగా బాలీవుడ్‌లో హవా ఎంతగా వీచిందో తెలిసిందేగదా.

నీతూ సింగ్...

నీతూ తన పదవ ఏట మొదటిసారిగా ..మాలా సిన్హా విశ్వజిత్ చిత్రం 'దో కాలియా' (1968)లో బేబీ సోనియాగా కనిపించింది. హాలీవుడ్ చిత్రం 'ది పేరెంట్ ట్రాప్'నే అలా రీమేక్ చేశారు. తొలి చిత్రంలోనే నీతుకు ద్విపాత్రాభినయం చేసే అవకాశం లభించింది. ఇందులో గంగ, జమునగా...చక్కగా తన నటనను ప్రదర్శించింది. ఆ తర్వాత 'వారిస్' (1969), 'పవిత్ర పాపి' (1970) వంటి పలు సినిమాల్లో బాల తారగా నటించి... 1973లో 'యాదోం కీ బారాత్'లో ఒక్కసారి హీరోయిన్‌గా తళుక్కున మెరిసి ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టింది.

రిషి కపూర్...

కపూర్ ఖాందాన్ నుంచి వచ్చిన మరో బాల నటుడు రిషి కపూర్. 'మేరా నామ్ జోకర్'లో తన చిన్ననాటి పాత్ర వేసే బాల నటుడికోసం రాజ్‌కపూర్ అన్వేషించే రోజులవి (1970). అప్పటి వరకు అలాంటి పాత్రలను శశికపూరే చేస్తుండేవాడు. కానీ ఈసారి మాత్రం రిషికపూర్‌కి ఆ అవకాశం ఇచ్చేశారు. పద్దెనిమిదేళ్ల రిషి ఆ పాత్రకు సరిగ్గా సరిపోయాడు. అందులో తమాషా సన్నివేశాల్లో చక్కగా నటించేసి వీక్షకులను నవ్వించేశాడు. అయితే ఆ తర్వాత హీరోగా బాబీ (1973)లో హీరోగా రంగప్రవేశం చేసి ఎంతటి విజయం సాధించాడో తెలిసిన విషయమే.

పద్మిని కొల్హాపురి...

బాల నటిగా 'డ్రీమ్ గరల్, జిందగీ, సాజన్ బినా సుహాగన్, థోడీ సీ బివాఫై' వంటి అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలందుకున్న నటి పద్మిని. అయితే సత్యమ్ శివమ్ సుందరమ్, ఇన్సాఫ్ కా



సంజయ్ దత్

శ్రీదేవి

శశి కపూర్

నీతు

హన్సిక

ఊర్మిళ

శ్వేత బసు



అమీర్



బాబీ డియోల్

తరాజులో మంచి పేరు సంపాదించుకొంది. తర్వాత దేవానంద్, షమ్మి కపూర్, దిలీప్ కుమార్ వంటి అగ్ర నటులతో కలిసి నటించే అవకాశాన్ని అందిపుచ్చుకుంది పద్మిని. తను నటించిన ప్రముఖ చిత్రాలు...ఓ సాత్ దిన్, ప్రేమ్ రోగ్, ఇష్క్ ఇష్క్ ఇష్క్.

సంజయ్ దత్...

మున్నాభాయ్ తన పన్నెండవ ఏట మొదటిసారిగా మొహానికి రంగు పులుముకుని కెమెరా ముందుకొచ్చాడు. అప్పట్లో సంజయ్ దత్ 'ఐటమ్ బోయ్'గా చేశాడు. తన తండ్రి సునిల్ దత్ చిత్రం 'రేష్మా ఔర్ షేరా' (1971)లో కవాలీ పాటలో సంజూదాదా డాన్స్ చేశాడు. పిల్లవాడైతేనేం స్టెప్పుల్లో తనకంటూ ఒక స్టైల్ చూపించాడు. తర్వాత బాలీవుడ్‌లో ఎన్ని విజయాలు సాధించిందీ..సాధిస్తోందీ చూస్తూనే వున్నాం.

శ్రీదేవి...

ఉపోద్ఘాతం అవసరం లేని నటి శ్రీదేవి. ఎనభైలలో సూపర్ స్టార్‌గా వెలుగొందిన శ్రీదేవి తన నాల్గవ ఏట నుంచే నటించడం మొదలెట్టింది. పలు తమిళ, తెలుగు చిత్రాల్లో బాలనటిగా తనకంటూ ఒక ముద్ర వేసుకుంది. తర్వాత హీరోయిన్‌గా బహుభాషా నటిగా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించింది. అయితే బాలీవుడ్‌లో మాత్రం 1977లో సోల్వాన్ సావన్ చిత్రంతో బ్రేక్ వచ్చింది. ఇంక అప్పటినుంచి బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొంది.

అమీర్‌ఖాన్...

'యాదోంకీ బారాత్' (1973)లో అమీర్‌ఖాన్ బాలనటుడిగా కనిపిస్తాడు. ఈ చిత్రం టైటిల్ సాంగ్‌లో ముద్దులొలికే అమీర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు (రెండు నిముషాల ఈ పాటలో టాయ్‌లెట్‌కు వెళ్లాలన్నట్టు తన చిన్న వేలు చూపిస్తాడు). ఇందులో అయితే తర్వాతి సంవత్సరం 'మదోష్'లో కూడా నటించాడు. కానీ హీరోగా అరంగేట్రం చేసిన సినిమా ఏంటనుకున్నారు! 'ఖయామత్ సే ఖయామత్ తక్' మాత్రం కాదు. కేతన్ మెహతా రూపొందించిన చిత్రం 'హోలీ' (1984).

బాబీ డియోల్...

బాబీని ఎప్పుడైనా బాలనటుడిగా చూసిన గుర్తుందా! మన్‌మోహన్ దేశాయ్ చిత్రం ధరమ్ వీర్‌లో కేవలం పది సెకన్ల పాటు కనిపిస్తాడు. అదీ బుల్లి ధర్మేంద్రగా. ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద హీరో మరి!

ఊర్మిళ

ఆ..ఆగండాగండి... బాల నటిగా ఈ రంగీలా అమ్మడి తొలి చిత్రం మీరనుకున్నట్టు శేఖర్ కపూర్ 'మాసూమ్' (1983) కాదు. శ్యామ్ బెనగల్ 'కలియుగ్'(1980). అందులో బాబుగా కనిపిస్తుంది. అదీ రాజ్‌బబ్బర్, రేఖ కుమారుడు పరీక్షిత్‌గా. 1987లో సన్నీడియోల్ సోదరిగా 'డెకాయిట్'లో కనిపించినా...1999లో దిల్లగీలో సన్నీ సరసన హీరోయిన్‌గా చేసింది.

ఆఫ్తాబ్ శివదాసాని...

భారతదేశం గర్వించదగ్గ నటులు అమితాబ్, అమీర్‌ఖాన్ చిన్ననాటి పాత్రలు పోషించే అవకాశం ఆఫ్తాబ్‌కి వచ్చింది. ఆఫ్తాబ్ బాల నటుడిగా తన కెరీర్‌ను మిస్టర్ ఇండియా (1987)లో మొదలెట్టాడు. తర్వాత షహెన్షా, చాల్‌బాజ్, సిఐడి, ఇన్సానియత్ వంటి పలు చిత్రాల్తో ఆకట్టుకున్నాడు. అయితే హీరోగా మాత్రం రామ్ గోపాల్ వర్మ చిత్రం 'మస్త్'లో కనిపిస్తాడు.

హృతిక్ రోషన్...

బాలీవుడ్ క్రేజీ హీరో హృతిక్ తన ఆరవ ఏట నుంచే నటించడం మొదలెట్టాడు. హృతిక్ తొలి చిత్రం తన తండ్రి రూపొందించిన 'ఆప్ కే దీవానే' (1980). తన తాతగారు దర్శకత్వం వహించిన 'ఆశా'లోనూ నటించాడు. అయితే 'భగవాన్ దాదా' (1986)లో మంచి పాత్ర లభించింది. దీన్ని రూపొందించి తాతగారైతే అందులోని ప్రధాన పాత్రధారుల్లో తండ్రి రాకేష్ రోషన్ కూడా కనిపిస్తాడు. అయితే చిత్రంలో మాత్రం వీరిద్దరికీ ఎలాంటి సంబంధబాంధవ్యాలు వుండవు. చిత్రం టైటిల్ పాత్ర పోషించిన రజనీకాంత్ దత్త పుత్రుడిగా కనిపిస్తాడు. ఒక పాటలో శ్రీదేవితో కలిసి డాన్స్ కూడా చేస్తాడనుకోండి. తర్వాత హీరోగా 1990లో తన తండ్రి దర్శకత్వంలో 'కహోనా ప్యార్ హై' చిత్రం ద్వారా తెరంగేట్రం చేసి... యువప్రేక్షకుల మనసులు కొల్లగొడుతున్నాడు.

హన్సిక మోత్వాని...

ప్రస్తుతం బహుభాషా హీరోయిన్‌గా డిమాండ్ వున్న ముంబై పాప హన్సిక...బాలనటిగా పలు చిత్రాల్లో చేసింది. రవీనా టాండాన్, మనోజ్ బాజ్‌పాయ్ నటించిన 'జాగో'... హమ్ కౌన్ హై, హవా, ఎస్కేప్ ఫ్రమ్ తాలిబన్ వంటి సినిమాల్లో చిన్నారి హన్సిక కినిపిస్తుంది. 'క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ' వంటి ప్రముఖ సీరియళ్లలోనూ నటించింది. అయితే ప్రేక్షకులను బాగా ఆకుట్టుకుంది మాత్రం హృతిక్ రోషన్ చిత్రం 'కోయీ మిల్ గయా'లో. ఇప్పుడు చూశారుగా...తెలుగు, హిందీ...చిత్రాల్లో ఎడా పెడా నటించేస్తోంది.

శ్వేత బసు ప్రసాద్...

కొత్త బంగారు లోకం హీరోయిన్‌గా ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు కొట్టేసిన హీరోయిన్ శ్వేత కూడా బాల తారే. 'మక్డే, ఇక్బాల్' వంటి చిత్రాల్లో నటనకు అవకాశం వున్న పాత్రలు పోషించడంతోనే సరిపుచ్చుకోలేదు. ఇక్బాల్ చిత్రంలో నటనకు గాను ఉత్తమ బాల నటిగా జాతీయ అవార్డును సైతం అందుకుంది.

అన్నట్టు బాల నటులతో సినిమాలు తీయడమనేది మన దేశంలో కొత్త విషయమేం కాదు. దాదా సాహెబ్ ఫాల్కే రోజుల్లోనే వుంది. 1917లో 'సిల్‌సిలా' నాడే వుంది. అదే సంవత్సరం తీసిన 'శ్రీకృష్ణ జననం'లో ఫాల్కే ఆరేళ్ల కూతురు బాలకృష్ణుడిగా చేసింది. బాలీవుడ్ ట్రాజిడీ క్వీన్సగా పేరుపొందిన మీనా కుమారి, గీతా, మధుబాల కూడా బాలనటులుగా చేసిన వారేనంటే నమ్ముతారా!

ఆకాశంలో తెరలు

విజ్ఞాన వీచిక

డా॥ కాకర్లమూడి విజయ్

మరో "అద్భుతమైన" ఆలోచన ఆకాశంలో వెనీషియన్ బ్లైండ్లను (పరదాలను) ఏర్పాటు చేయడం. ఒక గ్రాము బరువుండే డిస్కులను ఆకాశంలోకి వదలడం ఈ ప్రక్రియ. ఒక మిలియన్ (పది లక్షలు) డిస్కులుండే గొట్టాలను నిమిషానికొక గొట్టం చొప్పున ముప్పై ఏళ్లపాటు ఎలక్ట్రో మాగ్నటిక్ కాయిల్ గన్‌తో ఆకాశంలోకి విసరడం అయ్యాక, భూమికి పదిలక్షల మైళ్ల దూరాన ఆకాశంలో ఈ డిస్కులన్నీ 60,000 మైళ్ల పొడవు, 4,500 మైళ్ల వృత్తంలో ఒక తెరలా ఏర్పడతాయి.

హరిత గృహ వాయువులు భూవాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, అటువంటి ప్రభావాలు భూమిపైనున్న సకల జీవచరాల్నీ ప్రభావితం చేస్తాయనీ తెలుసు. హరిత గృహ వాయువుల్లో ముఖ్యమైనవి కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్, నైట్రోజన్ల తాలూకు ఆక్సైడ్‌లు. ఇవన్నీ సహజంగానూ, మానవ సంబంధిత చర్యల మూలంగా పరోక్షంగానూ వాతావరణంలోకి విడుదలౌతాయి.

ఇటువంటి అవాంఛనీయమైన ప్రభావాల గురించి, వాటిని నివారించేందుకు తీసుకోవలసిన చర్యల గురించీ, అటువంటి చర్యలు తీసుకోకపోతే ఉత్పన్నమయ్యే ఉత్పాతాల గురించీ దశాబ్దాల నుండి ప్రపంచ దేశాల స్థాయిలో చర్చలూ, ఒప్పందాలూ జరుగుతూనే ఉన్నాయి. అయినా ఫలితాలు ఊహించినట్లు లేవు. ప్రపంచంలో ఎక్కడా అడవులు నరికివేయడం ఆగలేదు (చెట్లు కార్బన్ డయాక్సైడ్‌ని పీల్చుకుంటాయి). ఎక్కడా శిలాజ ఇంధనాల వాడకం తగ్గలేదు (శిలాజ ఇంధనాలైన పెట్రోల్, డీజిల్ వంటివి దహనమైనప్పుడు సల్ఫర్ డయాక్సైడ్ విడుదలవుతుంది). మరి ఇవన్నీ వాతావరణంలో చేరి కాలుష్యం విస్తరించడంతోపాటు భూమిపై ఉష్ణోగ్రతలు పెరగటానికి కారణమవుతున్నాయి. వెరసి గ్లోబల్ వార్మింగ్ సమస్య తలెత్తుతుంది.

ఇటువంటి కాలుష్యకారణాలను తగ్గించడం ఎలానూ సాధ్యం కాదనుకున్నారో ఏమో, చాలామంది శాస్త్రవేత్తలు ఇప్పుడు ఈ గ్లోబల్‌వార్మింగ్ సమస్యను ఎదుర్కొనడానికి "జియో ఇంజనీరింగ్"లో పరిశోధనలు ప్రారంభించారు. ఇప్పటికే ప్రతిపాదించిన అనేక జియో ఇంజనీరింగ్ ప్రాజెక్టులలో భూగ్రహానికి సూర్యుడి వేడి తగలకుండా ఒక "పందిరి" నిర్మించడం ఒకటి.

వినడానికే విచిత్రంగా, కించిత్ హాస్యాస్పదంగా ఉన్న ఈ ప్రతిపాదన మరీ కొత్తదేం కాదు. 1974లోనే మిఖాయిల్ బుడికో అనే రష్యన్ శాస్త్రవేత్త సూచించినదే. ఈ ఆలోచన ప్రకారం వాతావరణంలోకి ఏటా కొన్ని మిలియన్ టన్నుల సల్ఫర్ డయాక్సైడ్ (ఎస్.ఓ2)ని వదలడమే! వాతావరణంలో ఎస్.ఓ2 లో ఆక్సిజన్, నీరుతో చర్య జరిపి సూక్ష్మ సల్ఫ్యూరిక్ ఆమ్ల బిందువులు ఏర్పడతాయి. ఇలా ఏర్పడిన ఈ బిందు సందోహాలు సూర్యరశ్మిని పైనుండి పైకే పరావర్తనం చెందేలా చేస్తాయి. సూర్యాస్తమయాల్ని మరింత ఎరుపుగానూ, ఆకాశాన్ని మరింత లేత నీలంగానూ మారుస్తాయి. ముఖ్యంగా భూమిని "చల్లబరుస్తాయి". ఈ ఆలోచనకి ఒక నిదర్శనం కూడా ఉంది. ఫిలిప్పీన్స్‌లోని మౌంట్ పినాటుబో అనే అగ్నిపర్వతం 1991లో మండి 20 మిలియన్ టన్నుల ఎస్.ఓ2 ని వాతావరణంలోకి వెదజల్లింది. ఫలితంగా ఒక సంవత్సరం పాటు వాతావరణం ఒక డిగ్రీ ఫారెన్‌హీట్ మేర చల్లబడింది! కాబట్టి కీర్తిశేషుడైన మిఖాయిల్ బుడికో ఆలోచన కచ్చితమైన ఫలితాలనిస్తుందని తేలిపోయింది.

కానీ బుడికో ప్రతిపాదించిన దాన్ని పునరాలోచించే సరికి భూమి ఉష్ణోగ్రత పెరిగిపోయింది. మంచు పర్వతాలు కరగడం ప్రారంభమైంది – చాలా మంచు కరిగిపోయింది కూడా. కానీ జియో ఇంజనీరింగ్ కూడా ఆసరికి ఊపందుకుంది. వాతావరణంలోకి సల్ఫర్ డయాక్సైడ్‌ని మానవులు ఎలాగూ పంపుతూనే ఉన్నారు కదా! శిలాజ ఇంధనాలను దహించడం ద్వారా ఏటా 55 మిలియన్ టన్నుల ఎస్.ఓ2 ని (8 బిలియన్ టన్నుల సిఓ2 కూడా) వాతావరణ కింది పొరలలోకి వదులుతున్నాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ) ప్రకారం ఆ మోతాదు ఎస్.ఓ2 ఏడాదికి 5,00,000 మందిని మరణానికి కారణమవుతుంది. మరి అదనంగా ఎస్.ఓ2 వదిలితే ఆమ్లవర్షాలు, కాలుష్య సమస్యలు అధికం కావా? వాతావరణంలో ఏ ప్రాంతంలో ఆ వాయువుందన్నది ఇక్కడ కీలకమైన అంశం. భూమికి దగ్గరగా ఉన్న వాతావరణపు పొర



ట్రోపోస్ఫియర్. దానిపైనున్నది స్ట్రాటోస్ఫియర్. ఆ స్ట్రాటోస్ఫియర్‌లోకి గనక ఈ వాయువులని పంపగలిగితే మానవులపై దుష్ప్రభావాలు ఉండవన్నది నిపుణుల భరోసా.

ఎస్.ఓ2 ని భారీ బెలూన్ల ద్వారానో, సల్ఫర్ అధికంగా ఉన్న విమాన ఇంధనాలతో విమానాలు నడపడం, మిసైళ్ల వంటి ఎస్.ఓ2 గోళాలను ఓడలనుండి ఆకాశంలోకి పేల్చడం వంటివి ఇప్పుడు పరిశీలిస్తున్న పద్ధతులు.

మరో "అద్భుతమైన" ఆలోచన ఆకాశంలో వెనీషియన్ బ్లైండ్లను (పరదాలను) ఏర్పాటు చేయడం. ఒక గ్రాము బరువుండే డిస్కులను ఆకాశంలోకి వదలడం ఈ ప్రక్రియ. ఒక మిలియన్ (పది లక్షలు) డిస్కులుండే గొట్టాలను నిమిషానికొక గొట్టం చొప్పున ముప్పై ఏళ్లపాటు ఎలక్ట్రో మాగ్నటిక్ కాయిల్ గన్‌తో ఆకాశంలోకి విసరడం అయ్యాక, భూమికి పదిలక్షల మైళ్ల దూరాన ఆకాశంలో ఈ డిస్కులన్నీ 60,000 మైళ్ల పొడవు, 4,500 మైళ్ల వృత్తంలో ఒక తెరలా ఏర్పడతాయి. ఇవి "పార్క్" చేయండే దూరం కీలకమైంది. ఈ ప్రదేశంలో సూర్యుడి, భూమి గురుత్వాకర్షణ శక్తి సమానంగా ఉంటుంది. దీనిని లాగ్రాంజియన్ పాయింట్ 1 (ఎల్1) అంటారు. ఈ డిస్కుల తెర భూమిపైకి వచ్చే సూర్యకిరణాల్ని తిప్పికొట్టి వాతావరణాన్ని చల్లబరుస్తుంది.

ఈ జియో ఇంజనీరింగ్ ప్రతిపాదనలు మనం చెప్పుకున్నంత సులభంగా సాకారం కావు. వీటికి ఖర్చు దగ్గరనుండి ఎన్నో అవరోధాలు ఉన్నాయి. వీటిని దాటుకుని ఇవి ఎంత ముందుకు సాగుతాయో కాలమే నిర్ణయించాలి! మరి ఇవి ఎప్పటికైనా సాకారమైతే అప్పటివరకు మనం వదిలే ఎస్.ఓ2, సిఓ2 వంటి వాయువులు భూమిని చల్లగా ఉండనిస్తాయా అన్నదీ కాలమే నిర్ణయించాలి. ఎందుకంటే మానవునిలోని స్వార్థం 'నేనొక్కడినే కారకుడినా'? అన్న ధోరణికి దారితీస్తోంది గనక.



నాన్

కావలసినవి

మైదా - 2 కప్పులు, వంట షోడా - అర టీ స్పూన్
పంచదార - 1 టీ స్పూన్, ఉప్పు - అర టీస్పూన్
పెరుగు - అర కప్పు
వేడి నీళ్లు - కలపటానికి తగినన్ని
గసాలు - 2 టీ స్పూన్లు, నూనె - పావు కప్పు

మైదా, తినే షోడా, ఉప్పు, పంచదార, పెరుగు అన్నీ వేసి తగినన్ని వేడినీళ్లు పోసి పిండి గట్టిగా కలపాలి. దానిలోనే కొంచెం నూనె కూడా వేసి బాగా కలపాలి. ఈ ముద్దని 2 గంటలు తడి బట్టలో నానబెట్టాలి. ఇలా చేయటం వల్ల పిండి పొంగుతుంది. నానిన తర్వాత మరలా పిండిముద్దని బాగా కలపాలి. ఇప్పుడు ఈ పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి నాన్ షేపులో చేసుకుని పైన గసాలు చల్లి రెండు వైపులా నీళ్ల తడి చేయాలి.పెనం మీద నీళ్లు చల్లి నాన్‌ను వేయాలి. ఇప్పుడు పెనాన్ని స్టౌపై తిప్పి వేసి కాల్చాలి. పెనం పైనుండి తీసిన తర్వాత నెయ్యి లేదా వెన్న రాసి పనీర్ బట్టర్ మసాలా లేదా మనకు నచ్చిన కూరతో వడ్డించాలి.

పనీర్ బట్టర్ మసాలా

కావలసినవి

పనీర్ - 2 కప్పులు
టమాటా జ్యూస్ - అర కప్పు
ఉల్లి తరుగు - 1కప్పు
గసాలు - 4 టీ స్పూన్లు
కారం - అర టీ స్పూను
కాజు - పావు కప్పు
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీ స్పూను
గరమ్ మసాలా - 1 టీ స్పూను
నూనె - తగినంత

పనీర్ ముక్కలను లైట్‌గా ఫ్రై చేయాలి. ఉల్లి, గసాలు, కాజు పేస్ట్ చేసి ఉంచుకోవాలి. నూనె వేడి చేసి ఉల్లి పేస్ట్‌ను ఫ్రై చేసి దానిలో టమాటా జ్యూస్‌ను కలిపి ఉడికించాలి. దానిలో ధనియాలు, జీరా, గరమ్ మసాలా, కారం వేసి కొంచెం నీళ్లు పోసి 2 నిమిషాలు ఉడికించాలి. దానిలో ఇప్పుడు పనీర్ ముక్కలు వేసి కలపాలి. దానిలో బట్టర్ లేదా క్రీమ్ వేయాలి. అంతే పనీర్ బట్టర్ మసాలా రెడీ.





నూడుల్స్

కావలసినవి

నూడుల్స్ - 1పాకెట్, నూనె - 2 టీ స్పూన్లు
ఉప్పు - తగినంత, క్యారెట్ తరుగు - 1కప్పు
క్యాబేజీ తరుగు - 1 కప్పు, కాప్సికమ్ చీలికలు - 1 కప్పు
ఉల్లి తరుగు - 1కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీ స్పూన్
మిరియాల పొడి - అర టీ స్పూన్, సోయా సాస్ - 2 టీ స్పూన్లు
చిల్లిసాస్ - అర టీ స్పూను

నూడుల్స్‌ను ఉడికించి, నీళ్లన్నీ వడకట్టాలి. బాండీలో నూనె వేసి వెల్లుల్లి పేస్ట్, ఉల్లి చక్రాలు వేసి వేయించి క్యారెట్, ఉప్పు, మిరియాల పొడి వేసి 2 నిమిషాలు ఉడికించాలి.తరువాత క్యాబేజీ తరుగు, కాప్సికమ్ చీలికలు వేసి 5 నిమిషాలు ఉడికించాలి. దింపే ముందు సోయా సాస్, చిల్లీ సాస్ వేసి మరో 5 నిమిషాలు ఉడికించాలి. ఇది వేడివేడిగా తింటే చాలా రుచిగా ఉంటుంది.

అనపకాయ హల్వా

కావలసినవి

అనపకాయ - అరకిలో, ఎండుకొబ్బరి - చెక్కలో సగం ముక్క
పంచదార - పావు కిలో, జీడిపప్పు - 25 గ్రాములు
కిస్‌మిస్ - 25 గ్రాములు, యాలకులు - 10
మిఠాయిరంగు - చిటికెడు, పచ్చకర్పూరం - కొంచెం
కుంకుమపువ్వు - కొంచెం, నెయ్యి - పావుకప్పు
పాలు - పావులీటరు

లేత అనపకాయ తీసుకుని చెక్కు తీసి కొబ్బరి కోరినట్టుగా కోరి ఉంచుకోవాలి. ఒక పాత్రలో నెయ్యి వేసి కాగబెట్టాలి. అందులో అనపకాయ కోరు, కొబ్బరి కోరు వేసి వేయించాలి. అందులో పాలు పోసి ఉడికించాలి. తర్వాత పంచదార వేసి ఉడికించాలి. దీనిలోని నీళ్లన్నీ ఇంకిపోయేదాక ఉడికించాలి. ముద్దగా ఒక దగ్గరికి వచ్చిన తర్వాత వేయించిన జీడిపప్పులు, కిస్‌మిస్, పాలల్లో కలిపిన మిఠాయిరంగు, పచ్చ కర్పూరం, కుంకుమ పువ్వు, యాలకపొడి అన్నీ వేసి బాగా కలియపెట్టాలి. ఇది చల్లబడ్డాక తింటే బావుంటుంది.



అందరి పండుగ

జీవితం ఒక పండుగ
అవును...
అది మొదలవుతున్నపుడు
నిజంగా పండుగే
ఒక్కో అడుగూ
నడిస్తే తెలుస్తోంది
పండుగ ఎవరికో!

బడికి వెళదామంటే
అవి డొనేషన్ల లొకేషన్లు
ప్రభుత్వ బడి వుంది కాని
అది పుస్తకాలు, గదులు లేని
ప్రకృతి మాత ఒడి

అతి కష్టం మీద
కాలేజీలో అడుగుపెడితే
మరోసారి తెలిసింది
ఇక్కడా చదువు ఓ వస్తువేనని
ఎ.సి.గదుల్లో పాఠాలు కొందరికి
మందలు మందలుగా కష్టాలు
ఇంకొందరికి
కళాశాలలు కావవి
గుత్త సంస్థల సేవకు
కూలీల్ని తయారు చేసే
కార్ఖానాలు

విమానాలు- బ్యాంకులు
ఉప్పు నుండి ఉక్కు దాకా
అన్నీ వారివే
పెట్రోలు పంపులు- హోటళ్ళు
రోడ్లు- ఆకాశహర్మ్యాలు
ఎక్కడ చూసినా బడాబాబులే
చివరికి కూరగాయలూ
వారే అమ్ముతారు!
గాలి చొరబడే చోటంతా
వీరు ఎగబడుతున్నారు
ఇక నేను చేసుకోవటానికి
ఏం మిగిలిందని!

నాకిది చాలా వక్రంగా
కనిపించింది
దీని పేరు మాత్రం
సరళీకరణ
ఎవరికి సరళం
ఎందరికి గరళం

నకిలీ విత్తనాలు, నకిలీ మందులు
రైతన్నకు సబ్సిడీ ఖజానాకో భారం
ఇంకోవైపు లక్షల కోట్ల రాయల్టీల హారం

పాక వేసుకుందామని
సెంటు భూమి అడిగితే
దిగింది గుండెలో తూటా
వేలంలో వేల ఎకరాలు కాటా

రోజూ సూర్యోదయం చూస్తున్నాను
ఎర్రటి సూరీడు పైకొస్తుంటాడు
మరో రోజు మొదలెడతాడు
కోటి కాంతులిస్తాడు
ఆ ఎర్రటి వెలుగులో
చరిత్ర కనిపిస్తోంది
నేనేం చేయాలో
స్పష్టంగా గోచరమౌతోంది

అవును
ఆ రోజు దగ్గరలోనే వుంది
నేనూ చేసుకుంటాను
నేనూ చేసుకుంటాను
అందరితో ఆ రోజు
పండుగ
అది
అందరి పండుగ

- జంధ్యాల శ్రీకరుణ

ఘర్షణ

నిజంగా నా కంటి చూపు
పరిధి
యిరుకయింది-

సత్యం
సంపూర్ణంగా అందని
పండయింది!

తిరగబడిన సత్యాల
నిత్య సాక్షాత్కారాలతో
ఎదురుపడ్డ సవాళ్లను
ఎదుర్కొంటూ...
తన చుట్టూ తానే తిరిగే భూగోళంలా
ఒక తిరిగొచ్చిన ప్రశ్ననై
నా జీవన కక్ష్యను దాటని ఆంక్షనై
పోర్లాడుతూ... పోరాడుతూ
బ్రతుకు భీకర యుద్ధక్షేత్రంలో
ఖడ్గాన్నెత్తిన వాణ్ణి!

ఇంద్రియానుభూతుల కావల
ఏదో రూపం నాపై
ఆధిపత్యం కోసం
సంధించే భావశరాలు

ఈ దేహానికి గాయం చేయకున్నా

హృదిలో నదీప్రళయఘోష
దుఃఖపు కనురెప్పలలో రక్తధార

ఎగసిపడే ఆవేశంలో
ఎంత వెతికినా దొరకని
శత్రువు జాడ
సత్యపు అంచును పట్టుకు
సాగే జీవన క్రీడ!

కె. ఆనందాచారి



అధిక బరువు కారణాలు

డాక్టర్ కె. శ్రీకాంత్,
ఎండొక్రినాలజిస్ట్,
శ్రీకాంత్ ఎండొక్రినాలజి క్లినిక్,
గుంటూరు.

ఎంతోమందిని వేధిస్తున్న సమస్య ఇది. చాలా మంది అధిక బరువు తగ్గడానికి నానా పాట్లు పడుతుంటారు. వీలుకాక నీరసపడిపోతుంటారు. అసలు మన శరీరంలో అనారోగ్యకరమైన కొవ్వు పేరుకుపోవడానికి కారణాలేంటి? దీని వలన కలిగే నష్టాలేంటి? అసలు ఊబకాయం ఎలా తగ్గించుకోవచ్చు? వంటి విషయాలు ఈ వారం తెల్సుకుందాం...

మీ తల్లిదండ్రులలో ఒకరు లేదా ఇద్దరు అధిక బరువు కలిగి ఉంటే మీరు సులభంగా బరువు పెరిగేందుకు వారసత్వం కారణం కావచ్చు.

మితిమీరిన భోజనం

ఎన్నో కారణాల మూలంగా మనం అధికంగా భోం చేస్తాం. అధిక భోజనం అనేది మనం చేసే శారీరక శ్రమతో ముడిపడి ఉంది. తక్కువగా పనిచేసే వారు తక్కువగా తిన్నా కానీ అది వారికి అధిక శక్తిని (క్యాలరీస్) ఇస్తుంది. దీనివల్ల బరువు పెరుగుతారు. ఎక్కువ శారీరక శ్రమచేసేవారు ఎక్కువగా తిన్నా కానీ బరువు పెరగకపోవచ్చు. సామాజికంగా ఈ రోజుల్లో ఎక్కువమంది శారీరకశ్రమ లేకుండా రోజంతా కూర్చొని పనిచేయడం మూలంగా వారు తినే ఆహారం వారు ఖర్చుచేసే క్యాలరీస్ కంటే ఎక్కువ క్యాలరీస్‌ని ఇస్తుంది. ఖర్చుకాని క్యాలరీస్ క్రొవ్వు పదార్థంగా మారి శరీరంలో పెరుగుతుంది. దీంతో స్థూలకాయం రావచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పెరిగిపోయాయి. దీంతో సాధారణ భోజనానికి బదులుగా గానీ లేదా భోజనంతో పాటు ఫాస్ట్‌ఫుడ్ (పిజ్జా, బర్గర్, కేక్‌లు, చాక్‌లెట్లు, ఐస్‌క్రీమ్‌లు, నూడుల్స్, కూల్‌డ్రింక్స్ మొదలైనవి) ఎక్కువగా తీసుకుంటున్నారు. తక్కువగా తీసుకున్నా ఫాస్ట్‌ఫుడ్స్ వల్ల ఎక్కువ క్యాలరీస్ వస్తాయి.

కొవ్వుతో కూడిన ఆహారం

సహజంగా మనం కొవ్వుతో కూడిన ఆహారాన్ని ఎంచుకుంటాం. ఎందుకంటే అవి రుచికరంగా లేదా తీసుకెళ్లేందుకు సులభంగా ఉంటాయి. కొవ్వుతో కూడిన ఆహారపదార్థాలు, పిండి పదార్థాలు, ప్రొటీన్ల కంటే ఎక్కువ క్యాలరీస్‌ను ఇస్తాయి. ఒక గ్రాము పిండిపదార్థం లేదా ప్రొటీన్ నాలుగు క్యాలరీస్ శక్తిని ఇస్తే కొవ్వు పదార్థం తొమ్మిది క్యాలరీస్ శక్తిని ఇస్తుంది. ఈవిధంగా తక్కువగా తిన్నాకానీ కొవ్వు పదార్థం ఇచ్చే క్యాలరీస్ ఎక్కువ. ఆకుకూరలు, కాయగూరలు అతితక్కువ క్యాలరీస్‌ను ఇస్తాయి.

శారీరక చురుకుదనం లేకపోవడం

ఆధునిక సాంకేతిక పరికరాలు జీవితం నుండి చాలా మటుకు శారీరక పనిని తగ్గించాయి. అవి మనం చురుగ్గా ఉండే అవకాశాన్ని కూడా తగ్గించాయి. ఈ రోజుల్లో మనం నడక కోసం సమయం తీసుకోవాల్సి ఉంటుంది, కానీ ఒకప్పుడు ఇది జీవిత సరళిలో భాగంగా ఉండేది.

పైన చెప్పిన కారణాలు కాకుండా థైరాయిడ్, షుగరు, ఎడ్రినల్ స్టెరాయిడ్ ప్రాబ్లమ్స్ మరికొన్ని జబ్బుల వల్ల కూడా ఊబకాయం/అధికబరువు వచ్చే అవకాశం ఉంటుంది.

బరువు ఎందుకు పెరుగుతారు?
తగ్గించుకోవడం ఎలా?

మీ బరువు అనేది మీరు ఖర్చుచేసే క్యాలరీస్ (మీరు చేసే శారీరక శ్రమ), మీరు తీసుకునే క్యాలరీస్‌ల (మీరు తినే ఆహారం) మధ్య సరైన సమతుల్యత లేకపోతే వస్తుంది. మీరు ఆహారం నుండి రోజూ తీసుకునే క్యాలరీస్ మీరు చేసే శారీరక శ్రమతో (ఖర్చుచేసే క్యాలరీస్) సమానంగా ఉంటే బరువు పెరగకుండా ఉంటారు. మరో మాటలో చెప్పాలంటే మీ శరీరం సరైన సమతుల్యత కలిగి ఉంటుంది. ఒకవేళ మీరు ఆహారం నుండి రోజూ తీసుకునే క్యాలరీస్ మీ శరీరానికి కావాల్సినంత క్యాలరీస్‌కంటే ఎక్కువగా ఉంటే మీ బరువు పెరుగుతుంది. మీ శరీరం అధిక శక్తిని కొవ్వు రూపంలో నిల్వ చేయడం మూలంగా ఇలా జరుగుతుంది. ఒకవేళ ఆహార లోపం ఏర్పడితే కొంత కాలం మీరు నిల్వ చేసుకున్న కొవ్వు శరీరానికి శక్తిని సమకూర్చుతుంది.

ఆహారం శరీరానికి పోషణ అందించడంతో పాటు ఎన్నో మానసిక అవసరాలకు సంతృప్తి కలిగిస్తుంది. భోజనం చేయడమనేది అనేది జీవితంలో కుటుంబం, స్నేహితులతో గడిపే అపురూప అనుభవం. విసుగెత్తినప్పుడు, ఏకాంతంగా ఉన్నప్పుడు, కుతూహలంగా ఉన్నప్పుడు, లేదా వేదనతో ఉన్నప్పుడు కూడా కొంతమంది భోంచేస్తారు. బరువు తగ్గించుకొని, దీనిని అలాగే కొనసాగించుకునేందుకు, మీరు అధికంగా భోజనం చేయడానికిగల పరిస్థితులను లేదా అనుభూతులను పసిగట్టడం అత్యవసరం. అధికంగా తినడానికి గల కారణాల కనుగొని దానికి దూరంగా ఉండాలి. రోజులో ఏదో ఒక సమయంలో ఆకలిగా లేకపోయినా తినడం. సినిమాకి, పార్టీలకు, రెస్టారెంట్లకు వెళినపుడు అవసరానికి మించి ఆహారం తీసుకుంటాము.

వ్యాయామం - ఆహార నియమాలు

బరువును తగ్గించుకోవడానికి ముఖ్యమైనది వ్యాయామం చేయడం. బరువు తగ్గడానికి శారీరక శ్రమ చేయడం ప్రధానం. వ్యాయామం చేయడం వల్ల క్యాలరీస్ ఖర్చు ఎక్కువగా ఉండి మనం తినే క్యాలరీస్‌తో సరిసమానంగా లేదా ఎక్కువగా ఉంటే బరువు అంతే ఉండటం కానీ తగ్గడం కానీ జరుగుతుంది. వ్యాయామం ఒక్కటే బరువును తగ్గించడానికి సరిపోకపోవచ్చు. దీనితో పాటు ఆహార నియమాలు, మన జీవన సరళిలో మార్పులు తీసుకురావడం చాలా అవసరం. బరువు తగ్గడం వల్ల అనారోగ్యానికి కారణమైన కొవ్వు తగ్గి కొలెస్ట్రాల్ ప్రాబ్లమ్స్, గుండె జబ్బులు, స్ట్రోక్, గురక, హైబ్లడ్‌ప్రెషర్ మొదలైన వ్యాధులు నివారించే అవకాశం ఉంది. వ్యాయామం చేయడం వల్ల బరువు తగ్గడమే కాకుండా చాలా ఉపయోగాలు ఉంటాయి. అధిక బరువు ఉన్నవారు వారు తీసుకు తీసుకునే ఆహారంలో అనేక మార్పులు చేయాలి. కొవ్వు పదార్థాలను తగ్గించి (వేపుడు కూరలు తగ్గించి పులుసు కూరలు ఎక్కువగా చేసుకోవడం) ఆకుకూరలు, కాయగూరలు, పీచు పదార్థాలు ఎక్కువగా ఉపయోగించాలి. పిండిపదార్థాలు కూడా తక్కువగా తీసుకోవాలి. ప్రొటీన్లు కలిగిన ఆహారాన్ని మామూలుగా తీసుకోవచ్చు.

ఇవికాకుండా నూతనంగా బరువు తగ్గడానికి అనేక రకాల మందులు మార్కెట్‌లోకి వచ్చాయి. కానీ ఇవి వ్యాయామం, ఆహార నియమాలకు ప్రత్యామ్నాయం కాదు. ఈ మందులు డాక్టర్ సలహా లేనిదే వాడకూడదు. వాడితే ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అధికబరువు ఉన్నవారు ఎండొక్రినాలజిస్టును సంప్రదించి వేరే వ్యాధుల కారణంగా బరువు పెరగలేదని నిర్ధారించుకున్న తర్వాత ఆహార నియమాలు, వ్యాయామం, అవసరమైతే మందులు ప్రారంభించాలి.

(మరిన్ని వివరాలు పైవారం...)



దారి చెప్తారా...

బాబుకు బూరలతో ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఆడుకోవాలని ఉంది. కానీ దారి తెలియక తికమక పడుతున్నాడు. మరి దారి చెప్పి ఆడుకోడానికి పంపిద్దామా.



తేడాలు కనిపెట్టాలోచ్

ఇక్కడున్న రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా ఉన్నాయి కదూ. కానీ సరిగ్గా చూస్తే ఆరు తేడాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టేస్తారు కదూ.

రంగులేద్దాం

పెద్ద పళ్ల రంపం కావాలంటే....

కార్పెంటర్‌కి చిన్న రంపంతో చెక్కను కోయటం కష్టంగా ఉంది. పెద్ద రంపం తీసుకొని చెక్కను కోద్దామంటే ఇక్కడున్న లెక్కలన్నీ చేసుకుంటూ ఎక్కడైతే ఆరు వస్తుందో ఆ దారిగుండా వెళితే పెద్దరంపం తనకు దొరుకుతుంది. మరి లెక్కలన్నీ చేసేస్తున్నారా!

		6+1	3+2	7+5	4+4
5+3	7+2	2+4	9+5	8+6	6+3
8+1	9+3	6+4	5+1	6+2	7+5
8+4	6+1	7+6	9+8		





పెద్ద హీరోలతో అయితేనే ....

హాయ్ చిన్నారులూ... మీ అందరికీ ముందుగా బాలల దినోత్సవ శుభాకాంక్షలు. అందుకున్నారా! మరైతే మాకు థ్యాంక్స్ చెప్పరా! ఓకే.... మరి ఈ సందర్భంగా మీకు ఓ పిడుగును పరిచయం చేద్దామనుకుంటున్నాం. సంతోషమేనా!! ఇక్కడ ఫొటో చూడగానే ఆ చాకు ఎవరో తెల్సిపోయినట్టుందే. అవును... మీరు ఊహించింది కరెక్టే. ఆ పిడుగు దర్శిల్ సఫారీ. 'తారే జమీన్ పర్' చిత్రంలో తొలిసారిగా నటించి ఇటు పిన్నల అటు పెద్దల మనసుల్లో తనకంటూ ఒక స్థానం సంపాదించుకున్నాడు. విమర్శకుల చేత 'దర్శిల్ బాగా చేస్తాడు' అనిపించుకున్నాడు. ఇంతకీ మీరు చూశారా ఆ సినిమా. చూసే వుంటార్లే. మరి నచ్చిందా! అంత బాగా చేస్తే... నచ్చకుండా ఎలా వుంటుంది. సరేగానీ....దర్శిల్ గురించి చెప్పకుందామా!

ఇంతకీ దర్శిల్ వయసెంత అనుకుంటున్నారు? ఎంత సింపుల్‌గా పదకొండేళ్లే..! 'తారే...' సినిమాను అంతా బాగా చూసేశారుకదా. దాంతో విజయవంతమైంది. ఇక చూస్కోండి? దర్శిల్‌కు బోలెడన్ని అవకాశాలు వచ్చాయి. బోలెడంత మంది డైరెక్టర్లు దర్శిల్‌ను కలిసి తమ సినిమాల్లో నటించమని అడిగారు. అంతేనా! ముఖ్య అతిథిగా కామిక్ పుస్తకాలు ఆవిష్కరిస్తున్నాడు. ర్యాంప్ మీద పెద్ద పెద్ద వారితో కలిసి మోడలింగ్ చేస్తున్నాడు. యాడ్స్‌లో కూడా బానే కనిపిస్తున్నాడు. ఉదాహరణకు హార్లిక్స్ యాడ్ తీసుకోండి. దాని బ్రాండ్ అంబాసిడర్‌గా యాడ్స్‌లో కనిపిస్తున్నాడు. అయితే మనవాడు మాత్రం ఎన్ని అవకాశాలు వచ్చినా...హృతిక్ రోషన్ వంటి పెద్ద పెద్ద హీరోలతో అయితేనే చేస్తానంటున్నాడట. పైగా రెమ్యునరేషన్ కూడా పెద్ద మొత్తంలోనే అడుగుతున్నాడంట. మరి దర్శిల్ తాజా చిత్రం ఏంటనుకుంటున్నారు! 'చిల్డ్రన్ ఆఫ్ హెవెన్' అన్న ఇరాన్ చిత్రాన్ని హిందీలోకి తీస్తున్నారు డైరెక్టర్ ప్రియదర్శన్. అందులో మన పిడుగు చేయబోతున్నాడంట. ఇంతకీ దర్శిల్‌కు ఇష్టమైన హీరో ఎవరనుకుంటున్నారు? ఎవరో కాదర్రా...'క్రిష్'. అదే...హృతిక్ రోషన్. ఇంకా షారూక్, అమీర్ కూడా ఇష్టమేనట. మరి ఇష్టమైన హీరోయిన్లంటారా... కరీనా కపూర్ అంటే ఇష్టం. యాక్షన్ విషయంలో అయితే రాణీ ముఖర్జీ అంటే ఇష్టం. ఇంకా ఐశ్వర్యా రాయ్ అన్నా ఇష్టమే. తనకిష్టమైన కార్టూన్ షో ఏంటనుకుంటున్నారు! టామ్ అండ్ జెర్రీ.... బెన్ టెన్. ఔనూ... దర్శిల్‌కు ఏమేం అవార్డులు వచ్చాయో చెప్పకోలేదుకదూ. తారే..లో చేసిన నటనకు గాను ఫిల్మ్ ఫేర్, స్టార్ స్క్రీన్ అవార్డు, జీ సినీ అవార్డు సొంతం చేసుకున్నాడు. మరెప్పుడైనా మరో పిడుగును పరిచయం చేసే వరకు బై...

ఎక్కడున్నాయ్

పిల్లలూ! పై బొమ్మలో కొన్ని వస్తువులు దాగున్నాయర్రా. ఆ వస్తువుల పేర్లేంటో చెప్తాం. అవి ఎక్కడున్నాయో మీరు వెతికి పట్టుకోవాలి. సరేనా! ఇంతకీ అవేంటంటే... **టోపీ, రాడిష్, టూత్ బ్రష్, ఐస్‌క్రీమ్, హాకీ స్టిక్, షూ, కేక్‌కప్, పెయింట్ బ్రష్, సాక్స్, చేతికి తొడిగే గ్లౌజ్**

బొమ్మ వేస్తారా



ఆవు బొమ్మను చూశారుగా. అచ్చంగా అలాగే కింద ఉన్న గళ్లలో వేస్తారు కదూ.



బహుదేశాలలో బాలల పండుగ



బాలలు...పిల్లలు...పసివాళ్లు... చిన్నారులు... అమాయకత్వం... అసూయ తెలీనితనం...వారి సొంతం. చిర్నవ్వు నవ్వితే చాలు చిందేస్తారు. ఎదుటివారు పలుకరించే వరకూ కూడా ఆగకుండా హాయిగా ఆత్మీయంగా పలుకరించేస్తారు. ఒక చిన్న చాక్లెట్ ఇస్తే చాలు ప్రపంచమంతా తమ చేతిలో వున్నట్టే ఫీలయిపోతారు. అభినందనపూర్వకంగా ఒక్క మాట అంటే చాలు ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంతగా ఆనందపడిపోతారు. ఎటువంటి ఇగోలకు, ఈర్ష్యలకు వారిలో చోటుండదు. అందుకే ఎంత కఠినాత్ములకైనా పిల్లలను చూడగానే మనసు కరగాల్సిందే. పెదవులు విచ్చుకోవాల్సిందే. అలాంటి బాలలకోసం ప్రత్యేకంగా కేటాయించిన ఒక్కగానొక్క రోజు నవంబర్ 14... బాలల దినోత్సవం. ఇది నిజంగా వారికి పండుగే. ఈరోజుకోసం పిడుగులంతా ఎంతగానో ఎదురుచూస్తారు. అయితే ఈ బాలల దినోత్సవాన్ని మనలాగా విదేశీయులూ ఇదే రోజున జరుపుకోరు. ఒక్కోదేశంలో ఒక్కో తేదీలో... మాసంలో జరుపుకుంటారు. ఆ కథనం ఈ వారం మీకోసం...

అంజన.కె

మిగతా రోజుల సంగతేమో కానీ బాల దినోత్సవం రోజున మాత్రం పిల్లలను దివి నుంచి భువికి దిగి వచ్చిన చిన్నారి దేవతల్లా చూస్తాం. ఇటు ఇంట్లోనూ అటు స్కూల్లోనూ వారిని ప్రత్యేకంగా ట్రీట్ చేస్తాం. వారికి స్వీట్స్ ఇవ్వడం...ఆటల పోటీలు నిర్వహించడం...సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం...విజేతలకు బహుమతులు ఇవ్వడం...అంతా హంగామాగా వుంటుంది. అందుకేనేమో 'అమ్మా! బాలల దినోత్సవం రోజూ ఎందుకు జరుపుకోం?!' అనడుగుతుంటారు కొందరు అల్లరి పిడుగులు. మరి తమను ప్రతిరోజూ ప్రత్యేకంగా చూడాలని, ఆటపాటల్లో గడపనివ్వాలని, ఇష్టమైన చిరుతిళ్లు, కొత్త బొమ్మలు ఇవ్వాలని ఆశపడని పిల్లలుంటారా చెప్పండి!

అందమైన బాల్యం ఆనందమయం కావాలని... ఆరోగ్యకర బాల్యం అందరికి అందాలన్నదే బాలల దినోత్సవం ఆకాంక్ష. ఐక్యరాజ్యసమితిలో బాలల దినోత్సవం జరపాలన్న నిర్ణయం జరిగాక మొదటిసారిగా 1954లో జరుపుకున్నాం. అయితే మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చనిపోయాక ... చాచాజీ గుర్తుగా ...ఆయన పుట్టినరోజైన నవంబర్ 14న బాలల దినోత్సవం జరుపుకుంటున్నాం. అసలే ఆయన చాచా నెహ్రూ కదా! ఎటూ ప్రస్తావన వచ్చింది కాబట్టి ఓ విషయం చెప్పుకోవాలి. నెహ్రూ చొక్కా మీద ఎప్పుడూ ఒక ఎర్ర గులాబీ వుంటుందని తెలీని వారుండరు. అయితే మొదటిసారిగా ఓ పిల్లవాడు నెహ్రూకి అలా ఒక పువ్వు పెట్టాడంట. అప్పటి నుంచి అలా గులాబి పెట్టుకోవడం నెహ్రూకి అలవాటైపోయింది. మన సంగతి సరే. విదేశాలలో మాత్రం బాలల దినోత్సవం నవంబర్ పద్నాలుగవ తేదీన జరుపుకోరు. ఒక్కో దేశం ఒక్కో రోజున జరుపుతుంది.

చైనాలో ...

అవును! జూన్ మొదటి తేదీన బాలల దినోత్సవం జరుపుతారు. గ్రీటింగ్ కార్డుల ద్వారా శుభాకాంక్షలు చెప్పుకోవడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం, ప్రత్యేకంగా చేసిన పిండివంటలు ఆరగించడం, బహూకరించిన బొమ్మలతో ఆడుకోవడం, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం సర్వసాధారణంగా కనిపిస్తుంది. ఆరోజున పాఠశాలలు తెరిచివున్నా తరగతులకు హాజరుకావాల్సిన పనిలేదు. హోంవర్క్ జంజాటం అసలే వుండదు. పైగా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. బాలలకోసం సినిమాలు వేస్తారు. అయితే ప్రాథమిక విద్యార్థులకు

మాత్రం ఒక పూట సెలవు వుంటుంది. ఆరోజంతా ఆటలే.. పాటలే.. వినోదమే.

పాకిస్తాన్‌లో...

మన పొరుగు దేశమైన పాక్‌లో మాత్రం నవంబర్ 20వ తేదీన బాలల దినోత్సవం జరుపుకుంటారు. ఆరోజున పాఠశాలలకు సెలవు ఇవ్వరు. మామూలుగానే తరగతులు నడుస్తాయి. అయితే ఈ పండుగను మాత్రం బాలల హక్కులకోసం కృషి చేసే స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తాయి. టీవీలు, రేడియోల్లో ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారం చేస్తారు. పత్రికలన్నిటిల్లో దీనికి సంబంధించిన సమాచారాన్ని, వ్యాసాలను, ప్రత్యేక వ్యాసాలను ముద్రిస్తారు.

జపాన్‌లో...

ఇక్కడ బాలల దినోత్సవాన్ని మే 5న జరుపుకుంటారు. ఐతే ఆరోజున మగపిల్లల ఆరోగ్యం కోసం ఐదవనెల ఐదవరోజున 'టాంగో న సెక్కు'ను జరుపుకోవడం పూర్వం నుంచీ వుంది. ఆరోజున మగపిల్లలు వున్న వారు ఇళ్ల బయట చేప ఆకారంలో వున్న పెద్ద పెద్ద గాలిపటాలు ఎగరేస్తారు. పైగా ఆరోజున ఇళ్లల్లో యుద్ధవీరుల బొమ్మలతో కొలువు ఏర్పాటు చేస్తారు. వీటికి సాంప్రదాయ దుస్తులు తొడుగుతారు. బలానికి, విజయానికి చిహ్నంగా భావిస్తారు కనుకే చేప ఆకారపు గాలిపటాలు ఎగరేస్తారు. కానీ ఇటీవలి కాలంలో అపార్టుమెంట్లు వచ్చాక ఇళ్లు ఇరుకయ్యాక గాలిపటాల సైజూ తగ్గింది. పైగా ఆరోజున వరిపిండితో ప్రత్యేకంగా చేసిన తీపి వంటకాలు ఆరగిస్తారు. చిన్నారులు సంప్రదాయ సమురాయ్ కత్తులు, డాళ్లు తిప్పుతూ ప్రత్యేక ప్రదర్శనలిస్తారు. పైగా ఆరోజు జాతీయ సెలవుదినం కూడా. ఈ సందర్భంగా పాఠశాలల్లో పిల్లలకు పాటలు నేర్పిస్తారు. అంతేకాకుండా చిన్నారులకోసం ప్రత్యేకంగా టోక్యోలో ఆటలపోటీలు నిర్వహిస్తారు.

దక్షిణ కొరియాలో...

ఇవన్నీ బాలల హక్కులే!



'పిల్లలకు హక్కులేంటి? పెద్దలు ఎలా చెప్తే అలా నడుచుకోవడమేకదా వారి పని!?' అనిపించొచ్చు. కానీ అమాయకులు...బలహీనులు అయిన పిల్లలను దోచుకునే పెద్దలున్న చోట పిల్లలకు హక్కులుండాల్సిందే. అందుకే ఐక్యరాజ్యసమితి పిల్లల హక్కులకోసం ఒక ఒప్పందాన్ని ఆమోదించింది. చైల్డ్ రైట్స్ కన్వెన్షన్ (సిఆర్‌సి)గా పేర్కొనే ఈ ఒప్పందం గురించి అందులో పేర్కొన్న బాలల హక్కుల గురించి ప్రత్యేకంగా ప్రచారం చేయడానికి నవంబర్ 20వ తేదీని బాలల హక్కుల దినోత్సవంగా నిర్ణయించింది. ఆరు దశాబ్దాల పాటు మానవహక్కుల నిపుణులు జరిపిన సుదీర్ఘ చర్చల ఫలితమే ఈ బాలల హక్కుల ఒప్పందం. దాదాపు ప్రపంచ దేశాలన్నీ ఈ చారిత్రాత్మక ఒప్పందం నిర్దేశించిన నియమాలను, ప్రమాణాలను పాటిస్తామని అంగీకరించాయి. ఇంతకీ బాలల హక్కులేంటంటే...

- జీవించడం, అభివృద్ధి చెందడం.
- సముచితమైన జీవన ప్రమాణాలు
- ఉత్తమ ఆరోగ్య ప్రమాణాలు, సమర్థవంతమైన ఆరోగ్య సేవలు
- అంగవికలురైన పక్షంలో ప్రత్యేక సంరక్షణ, వ్యక్తి గౌరవానికి భంగం కలగకుండా తమ పనులు తామే చేసుకొనేలా సమాజంలో వారు క్రియాశీలురుగా వుండేలా తీర్చిదిద్దడం.
- సాంఘిక భద్రత, అపహరణల నుంచి రక్షణ.
- చక్కటి కుటుంబ వాతావరణంలో తల్లిదండ్రులలో కలసి జీవించే హక్కు.
- ఉచిత ప్రాథమిక విద్య.
- పిల్లల వ్యక్తిత్వం, ప్రతిభ, మానసిక శారీరక సామర్థ్యం పూర్తి స్థాయిలో వికసించేటటువంటి చదువు.
- యుద్ధం, ప్రకృతి వైపరీత్యాలవంటి అత్యవసర పరిస్థితుల్లో కుటుంబానికి దూరమైనప్పుడు చట్టంతో సంఘర్షణ చేయాల్సి వచ్చినప్పుడు ప్రత్యేక రక్షణ హక్కు.
- బాల కార్మిక సమస్య, మత్తు పదార్థాల దుర్వినియోగం, లైంగిక దోపిడీ, పిల్లలను అమ్మడం, అపహరించడం, వ్యభిచారంలో దింపడం వంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రత్యేక రక్షణ కోరే హక్కు పిల్లలకుంది.



పేర్లు వేరైనా అదే బతుకు

కన్నవారు లేక, పెంచి పోషించే వారు లేక, ఆదరణ కోసం ఆప్యాయత కోసం అలమటించి పోతూ పసిప్రాయంలోనే బతుకు భారాన్ని భుజాన వేసుకొని వీధినపడ్డ వారే వీధిబాలలు. వీరు ఎక్కడంటే అక్కడ కనిపిస్తారు. బూట్ పాలిష్ చేస్తుంటారు. చిత్తు కాగితాలు ఏరుతుంటారు. చెత్త కుండీల్లో విసిరేసిన విస్తరాకులు వెతుకు తుంటారు. బిచ్చ మెత్తుకుంటారు. అయితే యునిసెఫ్ మాత్రం వీధి బాలల్ని మూడు విధాలుగా వర్గీకరించింది. 1) కుటుంబాలు వదిలేసిన బాలలు, స్వశక్తితో మనుగడ సాగిస్తున్న పిల్లలు, కుటుంబంతో వుండటానికి ఇష్టపడని బాలలు. 2) కుటుంబంతో నిత్యం సబంధాలు కలిగి వుంటూనే పొట్ట పోసుకోవడానికి చిన్నా చితకా పనులకై బయటికి వచ్చే పిల్లలు. 3) ఇల్లు వదిలి బయటికి వచ్చినా తరచూ కుటుంబంతో సంబంధాలు కలిగి వుండే చిన్నారులు. దేశ దేశాల్లో వీధి బాలలంటే వివిధ అర్థాలు, నిర్వచనాలు వున్నాయి. అమెరికాలో నీడలేని పిల్లలు, ఇల్లు వదిలి పారిపోయి వచ్చిన పిల్లలు వీధి బాలలుగా వ్యవహరిస్తారు. కెన్యాలో వీరిని 'పార్కింగ్ బాయిస్' అంటారు. వారిని న్యూ గినియాలో 'యంగ్ రాస్కెల్స్' అని పిలుస్తారు. ఇటలీలో వీరికి 'స్కుగ్నిజ్జోలు' అని పేరు వుంది. అంటే సంచారులు అని అర్థం. కామెరూన్‌లో 'పాసిన్' (పొలాల్లో పనిచేసే కార్మికులు) అంటారు. కామెరూన్ పోలీసులు వీళ్లని దోమలతో పోల్చుతారు. కాగా అత్యంత దారుణమైన విషయం ఏంటంటే గ్వాటిమాలాలో అదుపు తప్పిన వీధి బాలలను పిట్టలను కాల్చి చంపినంత తేలిగ్గా కాల్చి చంపుతారు. అభివృద్ధి చెందిన దేశాలుగా గుర్తింపు పొందిన బ్రెజిల్, కొలంబియాల్లో కూడా అక్కడి పోలీసులు ఇలాంటి చిన్నారుల పట్ల నిర్దయగా, క్రూరంగా వ్యవహరిస్తారు.

మే 5వ తేదీనే బాలల దినోత్సవం జరుపుకుంటారు. 1975 నుంచి ఇది ఆనవాయితీగా వస్తోంది. ఆరోజున ఇక్కడ పిల్లలకోసం పార్టీలు, పిక్నిక్‌లు ఏర్పాటు చేస్తారు. దేశ వ్యాప్తంగా పెరేడ్ నిర్వహిస్తారు. మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శిస్తారు. సాంప్రదాయ వస్త్రాలు వేసుకొంటారు. పెద్దలు తమ చిన్నారులను సరదాగా విహారయాత్రలకు తీసుకెళతారు. మ్యూజియమ్‌లు, జంతుప్రదర్శనశాలలు, పార్కులు, తోటలు పిల్లలతో కళకళలాడతాయి.

న్యూజిలాండ్‌లో...

ప్రతి సంవత్సరం మార్చి మొదటి ఆదివారం రోజున బాలల దినోత్సవం జరుపుకుంటారు. ఆరోజున పెద్దలు తమ పిల్లలకోసం ఎక్కువ సమయం కేటాయిస్తారు. వారు ఎప్పుడూ గుర్తుంచుకునేలా వారిని బయటికి తీసుకెళతారు. పాత సంప్రదాయాలను కొనసాగిస్తూనే ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను పాటిస్తుంటారు. ఏదిఏమైనా బాలల వినోదం, ఆనందమే ప్రధానంగా వుంటుంది.

పోలాండ్‌లో...

ఇక్కడ పిల్లల పండుగను జూన్ 1న జరుపుకుంటున్నారు. అక్కడ వేసవి ప్రారంభ సమయం కాబట్టి ... విద్యాసంవత్సరం ముగింపు సమయం కాబట్టి... ఆరోజు సెలవు వుంటుంది. ఆరోజున సాధారణంగానే స్కూళ్లల్లో రకరకాల కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. జూన్ మొదటి వారంలో పార్కుల్లో, వినోద కేంద్రాలలో పిల్లలకోసం ప్రత్యేకంగా ఉత్సవాలు జరుపుతారు. సహజంగానే పెద్దలు పిల్లలకోసం బహుమతులు కొని ఇస్తుంటారు.

శ్రీలంకలో...

అక్టోబర్ 1వతేదీ అంటే పిల్లలకు పండుగే. ఆరోజు సెలవు కూడా. ఎందుకంటే పెద్దలు వారిని ఆ రోజు తప్పనిసరిగా బయటకు తీసుకెళతారు. స్కూళ్లలో వారికి మిఠాయిలు ఇస్తారు. పైగా ఇళ్లలో వారికోసం స్పెషల్‌గా స్వీట్లు చేసిపెడతారు. అంతేకాకుండా బహుమతులు కూడా ఇస్తారు. పిల్లలకు పార్కుల్లో ఆరోజు ఉచిత ప్రవేశం లభిస్తుంది.

మరి కొన్ని దేశాల్లో...

హాంగ్‌కాంగ్ -ఏప్రిల్ 4, నైజీరియా -మే 27, ఉత్తర కొరియా -జూన్ 2, టర్కీ - ఏప్రిల్ 23, పెరూ-ఆగస్టు 17, పరాగ్వే -ఆగస్టు 16, మలేషియా - అక్టోబర్ 1, గాటమాలా -అక్టోబర్ 1, హొండరస్ -సెప్టెంబర్ 10, జర్మనీ-సెప్టెంబర్ 20, ఎల్ సాల్వడార్ -అక్టోబర్ 1, క్యూబా -జులై మూడవ ఆదివారం, కోస్టారికా-సెప్టెంబర్ 9, చెక్ రిపబ్లిక్ -జూన్ 1, చిలీ -ఆగస్టు రెండవ ఆదివారం, కొలంబియా -ఏప్రిల్ చివరి వారాంతాలు, కెనడా -నవంబర్ 20, ఆస్ట్రేలియా -జులై మొదటి ఆదివారం, అర్జంటీనా - ఆగస్టు రెండవ ఆదివారం, బ్రెజిల్ -అక్టోబర్ 12, నైజీరియా -మే 27, రొమానియా -జూన్ 1.

✧ ✧ ✧



ఇలా చేస్తే...

మంచి బట్టలు, మిఠాయిలు, బహుమతులు, బొమ్మలు, తుళ్లింతలు, సంతోషాలు, ప్రేమలు, ఆప్యాయతలు, అభినందనలు అన్నీ... కొందరికే. మరి కొందరికో! ఇవేవీ వుండవు. చిన్ని కడుపు నింపుకోడానికి చిట్టి చేతులు మురికిలో, రాళ్లల్లో, ఎర్రటి ఎండలో, కుంభవర్షంలో, వణికించే చలిలో పని చేస్తుంటాయి. వీళ్లకు ఒక్క ప్రశంస కూడా వుండదు. తిట్లు చీత్కారాలు తప్ప. ప్రేమతో కూడిన పలకరింపు ఒక్కటి కూడా వుండదు. తమ కళ్లెదురే ఎందరో పిల్లలు బడికెళ్తున్నా...తాము మాత్రం బండ చాకిరీ చేయాల్సిందే. చిన్న పొరపాటుకు కూడా యజమానుల దగ్గర బండబూతులు, తన్నులు తినాల్సిందే. వీరే బాల కార్మికులు, వీధి బాలలు. బాలల దినోత్సవ సంతోషం వీరికి మాత్రం ఎందుకు పంచకూడదు!? అని ఆలోచిస్తే...మనకూ ఏవో ఉపాయాలు తడతాయి. వారినీ మన పిల్లలోపాటు కనీసం ఆ ఒక్కరోజైనా ఆదరించొచ్చు. కొత్తవి కొనిచ్చే స్తోమతు మనకు లేకపోయినా కనీసం మన పిల్లలకు ఇరుకైన బట్టలు, ఆడుకోని బొమ్మలయినా ఇచ్చి వారి కళ్లల్లో కించిత్ మెరుపును, పెదవులపై చిరు నవ్వును చూడొచ్చు. ఈ పని మీ చేతులతో కాకుండా మీ పిల్లలతో చేయిస్తే వారికి పేదరికం అంటే ఏంటో... పేద పిల్లలు ఎలా వుంటారో? వారి భావాలు ఎలా వుంటాయో తెలుస్తుంది.



హిప్నో కమలాకర్
ఫోన్ నెం:9390044031

నత్తి నుంచి విముక్తి ప్రసాదించరూ...

నా వయస్సు 23 సంవత్సరాలు. నన్ను వెంటాడుతున్న సమస్య 'నత్తి'. దీని గురించి ఎం.ఎస్.సి సీటు కాన్సిల్ చేసుకున్నాను. నత్తి నుండి విముక్తి పొంది ఉన్నత చదువులు చదవాలని నాకోరిక. ఏదైనా సలహా ఇచ్చి పరిష్కారాన్ని సూచించండి.

సురేష్, కరీంనగర్.

జీవితంలో ముందుకు వెళుతున్న క్రమంలో ఎన్నో మానసిక, శారీరక సమస్యలు ఏర్పడుతూనే ఉంటాయి. ఎన్ని వచ్చినా మీ లక్ష్యం ముఖ్యం. నత్తి అనేది చిన్నతనంలో భయంవల్ల, అనుకరించటం వల్ల ఒత్తిడి ఏర్పడినప్పుడు మొదలవుతుంది. కాబట్టి మీ దృష్టి అంతా మీ లక్ష్యంమీదే పెట్టండి. రోజుకి ఒక కొత్త వ్యక్తితో మాట్లాడండి. బ్రీతింగ్ ఎక్సర్ సైజులు చేయండి. స్పీచ్ థెరపిస్ట్‌ని, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌ని కలవండి. ఆల్ ది బెస్ట్.

బాగా చదవలేకపోతున్నా...



నేను జి.ఎన్.ఎన్ ఆఫ్ శ్రీకాకుళం హాస్టల్‌లో ఉంటున్నాను. ఆ మధ్యన బాగానే చదివేవాడిని కానీ ఇప్పుడు చదవలేకపోతున్నాను. మా సార్లందరూ తిడుతున్నారు. పోనీ చదవాలని అనుకుంటాను.అది కూడా రెండు గంటల కన్నా ఎక్కువ చదవలేను. తర్వాత కూడా చదువుదాం అనుకున్నా బుర్రకు ఎక్కడం లేదు. కాబట్టి మీరు నా సమస్య తీర్చగలరని మనవి చేసుకుంటున్నాను.

నవీన్, మచిలీపట్నం.

క్లాస్‌లో చెప్పిన పాఠం అర్థం కాకపోయినా చదవబుద్ధి కాదు. ఒకటి, రెండు గంటలు ఏకధాటిగా చదివినా ముందు విషయాలు , ఆఖరి విషయాలు గుర్తుంటాయి. మధ్యలోవి మర్చిపోతాము. కాబట్టి అరగంటకు ఒకసారి 5 నిమిషాలు విశ్రాంతి ఇస్తూ చదువు. కొత్త ఆటలు నేర్చుకో. కొత్త విషయాలు తెలుసుకో. ఏ రోజు చెప్పిన పాఠాన్ని ఆరోజే చదువుకో. మీస్నేహితులు, ఉపాధ్యాయుల సహాయం తీసుకో. నీకు వచ్చిన పాఠ్యాంశాలను నీ స్నేహితుల దగ్గర చర్చించు. వాళ్లకు వచ్చిన విషయాలను చెప్పమను. ముఖ్యమైన విషయాలను ఎప్పటికప్పుడు రాసుకో. పాఠ్యాంశాలను రివిజన్ చెయ్యటం వలన ఎప్పటికీ మర్చిపోవు. పాఠ్యాంశాలను కథలుగా క్రియేట్ చేసుకో. నేను బాగా చదివేవాణ్ణి కాబట్టి ఇప్పుడు ఇంకా బాగా చదువుతాను అని రోజూ అనుకో.

బయటపడడం ఎలా!

నా వయస్సు 20 సంవత్సరాలు. తల్లిదండ్రులిద్దరూ నిరక్షరాసులు. తండ్రికి తాగుడు అలవాటు ఉంది. ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తూ నెలకి 1500 రూపాయలు సంపాదిస్తున్నారు. అప్పులు 5000 దాకా వున్నాయి. జీవితంలో పైకి రావాలని ఉంది. ఈ సమస్యల నుండి బయటపడడం ఎలా?

అను, ఒంగోలు.

పరిస్థితులను తట్టుకొంటూ జీవితంలో పైకి రావాలనుకుంటున్న నీ వ్యక్తిత్వాన్ని ముందుగా అభినందించి తీరాలి. ఇప్పుడు నువ్వు చేయవలసింది ఏంటంటే...నువ్వు ఏదైతే చేస్తున్నావో దానిని వదిలిపెట్టకుండా నీకున్న అర్హతలను పెంచుకునే ప్రయత్నం చేయటం. పైగా నీ విద్యార్హతలను, నీ నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలా అని నిరంతరం ఆలోచించు. మార్గం దొరుకుతుంది. ఏపరిస్థితి శాశ్వతంగా ఉండిపోతుందని అనుకోకు. నీ ప్రయత్నం చేస్తూ ఉంటే నెమ్మదిగా పరిస్థితులు చక్కబడే అవకాశం ఉంది. ఆశావాదం పెంచుకో.

అవే కలలు...

నా పేరు అనిత. నాకు సెక్స్‌కు సంబంధించిన కలలు వస్తాయి. నేను ఏం చేయాలి. పైగా ఇప్పుడు కొత్త ఆలోచన. అది నేను హైట్ తక్కువ. అది నన్ను బాధిస్తున్నది. 18 సంవత్సరాలు నిండినవారు ఇక పెరగరంటున్నారు. ప్రపంచంలో కొత్త కొత్త ప్రొడక్స్ చాలా వస్తున్నాయి. కనిపెడుతున్నారు. అలా ఏమైనా ఉన్నాయా? ప్లీజ్ దయచేసి చెప్పండి.

అనిత, ప్రొద్దుటూరు.

పొడవు పెరగటానికి మందులు ఏమీ లేవు. నీ పొడవుకు తగిన విధంగా డ్రెస్ చేసుకుంటే పొడవుగా కనిపిస్తావు. అవసరమైతే బ్యుటీషియన్‌ని కలవండి. ఈ వయసులో సెక్స్ కోరికలు, కలలు రావడం సహజం. నీవు చదివే చదువుమీద, పనిమీద దృష్టి పెట్టండి. కొత్తగా ఏదో ఒకటి నేర్చుకోవటానికి, కొత్తకొత్త ఆలోచనలు చేయటానికి ప్రయత్నించండి. ఒక ప్రణాళిక ప్రకారం మీ లక్ష్యాన్ని చేరుకోండి. అతిగా వచ్చే ఆలోచనలకు కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌ను కలవండి.

కథ

హద్దు

అవేళ రంగమ్మని కూర్చోపెట్టింది భాగ్యమ్మ. "మనసు పాడుచేసుకుని పిచ్చివాళ్ళల్లా తిరక్కండి. పల్లెలో చిన్న కొంప ఉందన్నారు గదా. దాన్ని అమ్మేసి రమ్మను. అదేం ఉద్ధరించడం లేదు గదా. నలభై వేలు రాకపోవు. పని గడిచిపోతుంది. పిల్ల సుఖపడుతుంది. మీ ఆయనకి చెప్పు." ఈ హితబోధ రంగమ్మకీ బాగానే వుందనిపించింది. పల్లెకు పోయి ఆ పని కానిచ్చుకొచ్చాడు నరసయ్య. నలభైవేలు వచ్చింది. నరేందర్ తల్లికి అందజేయించాడు.

లేనివాడి ఆలోచనలెప్పుడూ నలుదిశలకీ పరుగెత్తుతూనే ఉంటాయి. కట్నం డబ్బు సమకూరింది. ఇచ్చేశారు సరే. మరి పెళ్ళి ఖర్చు? ఇదీ సమస్య. భార్యా భర్తా మల్లగుల్లాలు పడుతూనే క్షణాల్ని యుగాలుగా గడపసాగారు. ఆ రాత్రి - వంటింట్లో చీకటి తెరల మధ్య రంగమ్మ గుండెలకి తల ఆనించిన నరసయ్యకి నులివెచ్చని స్పృహ కలిగింది. రక్కున లేచి కూర్చున్నాడు. "ఇవన్నీ కాదు గానీ, రేపు పెద్దమ్మగారినే అడుగుదామే. మీరే లక్ష్మిని పెళ్ళిచేసి గడప దాటించాలని చెప్దాం" అన్నాడు.

- విహారి

నరసయ్యకి కడుపు రగిలిపోతోంది. రంగమ్మకీ మనసు కుతకుతలాడిపోతోంది. ఇద్దరూ ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు. ఇంతకీ జరిగిందేమిటి?

✧✧✧

ఆ ఇంటికే ముహూర్తాన వచ్చి చేరారో గానీ - నరసయ్యే పనిమనిషీ, తోటమాలీ, డ్రైవరూ -

'వెచ్చాలు తేవాలి నరసయ్యా', 'ఆ చెట్టు మాట వినని పనిమనిషిలా అటూ ఇటూ విరగబడుతోంది. ఆ కరివేపాకు కొట్టేసి మార్కెట్‌లో ఇచ్చేయాలి నరసయ్యా', 'ఆ సన్నజాజి తీగె దేశాటనం మొదలెట్టింది. లాగి కట్టుదాన్ని', 'అరటి చెట్లకి పాదులు చెయ్యాలి నరసయ్యా', 'ఇటు చూడు ఈ బియ్యం మూటలిక్కడే వుంచేశావ్. సజ్జ మీది కెక్కించెయ్', 'రేపు గుంటూరు వెళ్ళి రావాలి. తెల్లవారుజామునే బయల్దేరదాం. కారు సిద్ధం చేసుకో'.

ఇలా, ఇంట్లో ఏది కావాలన్నా నరసయ్యా అనే పిలుపే!

రంగమ్మకీ పురమాయింపులు తక్కువేమీ కావు. గుడ్డలుతకటం, అంట్లు తోమటం, ఇల్లు శుభ్రం చేయటం వంటి పనులన్నీ ఆమెవే.

భాగ్యమ్మ రాగాలు తీస్తుంది. 'రంగమ్మా చూడవే. ఆ పెసల పని అట్టాగే ఉండిపోయింది. ఎప్పుడు మర పట్టించుకొస్తావే?'. భాగ్యమ్మ కూతురు పంకజమ్మ 'రంగమ్మా, రేపు భోగి, ఎల్లుండి ఉండ్రాళ్ళ తద్దెకదే. ఆ గోరింటాకు దూసి రుబ్బు, నీ పిల్లలకీ కావాలి', 'పెద్ద పండగొస్తున్నదే. ఇల్లు బూజు దులిపి, తుడిచెయ్యాలి', పంకజమ్మ కూతురు చంద్రలేఖకి చాలా పనులుంటయ్. 'ఈ ఏడాది ఇక్కడున్నాం కదా, ఢిల్లీలో ఈ ముచ్చట్లేమీ వుండవు. ఆ వేపచెట్టుకి ఉయ్యాల కట్టించు. పిల్లలు ఊగుతారు. మా చక్రంగాడూ, సుధా చూస్తారా ముచ్చట' - ఇదీ వరస!

అన్నిటికీ, అందరికీ ఈ దంపతుల జవాబు 'అలాగేనమ్మా' అనే.

వీళ్ళిద్దరూ విజయవాడలో ఆ యింటికొచ్చి పన్నెండేళ్ళు. రెండు గదుల ఔట్‌హౌస్‌లో కాపరం. అప్పుడు వీళ్ళ పెద్దపిల్ల లక్ష్మికి ఆరేళ్ళు. కొడుకు దీపూకి మూడేళ్ళు. అద్దె లేదు. ఇద్దరూ ఇంట్లో మనుషుల్లా భాగ్యమ్మా వాళ్ళతో కలిసిపోయారు.

భాగ్యమ్మకి భర్త లేడు. ఒక్కటే కూతురు పంకజం. ఈమె భర్త నాలుగేళ్ళ క్రితం పోయాడు. ఆయన చేసిన పనల్లా దోశెడు నోట్లు తీసుకుని దేశాటన పోవటం. తిరిగి తిరిగి మళ్ళీ డబ్బు కోసం రావటం. తాగి తాగి పోయాడంటారు. ఎక్కడో పక్కటౌన్లో వేరే మనిషితో సంసారమూ ఉందనే వారు. పంకజమ్మ బిడ్డల్ని ఒక పద్ధతిగా పెంచింది. కూతురు చంద్రలేఖ ఢిల్లీలో వుంటుంది. ఇద్దరు పిల్లలు చక్రవర్తి, సుధ. భర్త సెంట్రల్ గవర్నమెంట్‌లో పెద్ద ఉద్యోగి. పంకజమ్మ కొడుకు అవినాష్. కోడలు అనుమప. ఇద్దరూ డాక్టర్లు. అమెరికాలో ఉంటారు. రెండేళ్ళకో, మూడేళ్ళకో గానీ రారు. వచ్చినప్పుడో నెల ఉండి వెళ్తారు. అమ్మమ్మకీ, అమ్మకీ సౌకర్యంగా వుంటుందని కారు కొని ఇంట్లో పెట్టి వెళ్ళాడు అవినాష్. ఊళ్ళో ఏ పనులున్నా, గుంటూరులో ఉన్న భాగ్యమ్మ అన్న డాక్టర్ రామలింగయ్యగారింటికి వెళ్ళాలన్నా కార్లోనే వెళ్తారు. నెలలో నిండా పదిరోజులు కూడా కారు బయటికి తీసే అవసరం రాదు.

✧✧✧

'మావ ఎక్కడన్నా పనుంటే డ్రైవర్‌గా వెళ్తానంటున్నాడమ్మా. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. మీకు తెలీనిదేముంది. నాలుగు రూపాయలొస్తే వేణ్ణీళ్ళకి

చన్నీళ్లలా కాస్త చెయ్యాడుతుంది. నీళ్ళు నములుతూ అడిగింది రంగమ్మ. ఆమె భర్తని మావ అనే పిలుస్తుంది. అమ్మ తమ్ముడే మరి!

భాగ్యమ్మ తలెత్తి అదోలా చూసింది. చేతిలో భాగవతం పుస్తకాన్ని పక్కన పెట్టింది. పంకజమ్మ ఉన్నది. ఆమే గయ్‌మన్నది. "అంటే పార్ట్ టైమ్ పని చేస్తాట్లే మీ ఆయన? కారు తియ్యకబోతే మనకు ఇంట్లోనూ బయటా పనుల్లేవూ?"

రంగమ్మ మారు మాట్లాడలేదు.

ఆ రాత్రి భర్తకీ సంగతి చెప్పి "పోస్లే మావా, వాళ్ళ మనుషులుగా ఇంతకాలమూ కలిసిపోయ్యాం. రోజులు గడిచి పోతున్నై కదా, చూద్దాం" అన్నది.

నరసయ్య భార్య వైపు, గోడవారగా చాపమీద పడుకుని నిద్రపోతున్న కూతురు వైపూ చూపు మార్చి మార్చి చూస్తూ ఉండిపోయారు.

తర్వాత చాలా సేపటికి తనకు తానే చెప్పుకుంటున్నట్టు పైకే అన్నాడు. పిల్లకి సమ్మందాలు చూడాలి రంగీ అని, క్షణాల తర్వాత "వీడికీ ఈ ఏడాదితో టెన్త్ అయిపోతుంది. పిల్లనంటే అక్కడితో ఆపేశాం. వీడినేం చేయాలో మరి" అన్నాడు.

దిగాలుగా భర్తవైపు చూసింది రంగమ్మ. "చూద్దాం పడుకో" అని గాల్లో దేవుడికి దణ్ణం పెడుతూ నడుం వాల్చింది.

◇◇◇

లక్ష్మికి పెళ్ళి సంబంధం దొరికింది. ఒక తెలిసినాయన ద్వారా వచ్చింది. వరుడు నరేందర్. ఎలక్ట్రీషియన్. ఏదో ఒక షాపుతో లింకు కుదిరింది. షాపు కొచ్చే వారితో మంచిగా వుంటూ పనుల్ని రాబట్టుకోగల నేర్పు వుంది. ఇటీవల ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ కాంట్రాక్టు తీసుకుని, ఇంకో ఇద్దరు స్నేహితులతో కలిసి పని పూర్తి చేశాడు. పైసలు బాగానే వచ్చినై. నరేందర్‌కి తల్లీ, ఒక తమ్ముడు, ఒక చెల్లెలు. తమ్ముడు సైన్స్‌లోనూ, చెల్లెలు ఆరులోనూ చదువుతున్నారు. మూడుగదుల పాత ఇల్లుంది.

పెళ్ళి చూపులయినై. సరి అనుకున్నారు ఇరుపక్షాలూ.

భాగ్యమ్మగారి సముఖంలోనే కట్న కానుకల మాటలూ సాగినై. నరేందర్ తల్లి అరవైవేలు అడిగింది.

నరసయ్య, రంగమ్మ గుడ్లు తేలేశారు. తమ వల్ల కాదన్నారు. ఆలోచించుకుని తర్వాత చెప్తామన్నారు. ఇందులో భాగమ్మ పెద్దరికంగా ఇద్దర్నీ కూచోపెట్టింది.

నరేందర్ తల్లి సాత్వికమైన స్వభావం కలిగిన మనిషే. "పెద్దవారు మీరు చెప్తే కాదనేదేం వుంది" అంది భాగ్యమ్మని చూస్తూ.

దిక్కులు చూస్తూ కూర్చున్నారు నరసయ్య, రంగమ్మా. లోవాకిట్లో లక్ష్మి, తల్లి పక్కగా నరేందర్ ఉత్కంఠతో, ఉద్వేగంతో దొంగచూపుల్లో మునిగి వున్నారు.

భాగ్యమ్మ అన్నది, "వీళ్ళ సంగతీ, స్థితిగతులూ తెలుసుకున్నారు కదా. అన్నీ కలిపి నలభై వేలిస్తారు. సరే అనుకోండి. పిల్ల బంగారం. చూశారు గదా. చిదిమి దీపం పెట్టుకోవచ్చు."

చాలా మాటల కలబోత తర్వాత, "సరే కానియ్యండి" అంది నరేందర్ తల్లి.

అక్కడికి ఆ ఘట్టం పూర్తయింది.

నరసయ్య, రంగమ్మా పనిపాటలు చేస్తున్నారన్నమాటే గానీ, ఇద్దరికీ మనసు మనసులో లేదు. గుండెల మీది కుంపటి నెత్తి మీది కొచ్చినట్లయింది. డబ్బు సమస్య! మనుషుల్ని ఊపిరి సలపనీయటం లేదు. ఇద్దరి కళ్ళల్లోనూ ఎడారి మబ్బులు కమ్ముకునే ఉన్నై.

ఆవేళ రంగమ్మని కూర్చోపెట్టింది.

"మనసు పాడుచేసుకుని పిచ్చివాళ్ళల్లా తిరక్కండి. పల్లెలో చిన్న కొంప ఉందన్నారు గదా. దాన్ని అమ్మేసి రమ్మను. అదేం ఉద్ధరించడం లేదు గదా. నలభై వేలు రాకపోవు. పని గడిచిపోతుంది. పిల్ల సుఖపడుతుంది. మీ ఆయనకి చెప్పు."

ఈ హితబోధ రంగమ్మకీ బాగానే వుందనిపించింది.

పల్లెకు పోయి ఆ పని కానిచ్చుకొచ్చాడు నరసయ్య. నలభైవేలు వచ్చింది. నరేందర్ తల్లికి అందజేయించాడు.

లేనివాడి ఆలోచనలెప్పుడూ నలుదిశలకీ పరుగెత్తుతూనే ఉంటాయి. కట్నం డబ్బు సమకూరింది. ఇచ్చేశారు సరే. మరి పెళ్ళి ఖర్చు? ఇదీ సమస్య. భార్యా భర్తా మల్లగుల్లాలు పడుతూనే క్షణాల్ని యుగాలుగా గడపసాగారు.

ఆ రాత్రి -

వంటింట్లో

చీకటి తెరల మధ్య రంగమ్మ గుండెలకి తల ఆనించిన నరసయ్యకి నులివెచ్చని స్పృహ కలిగింది. రక్కున లేచి కూర్చున్నాడు. "ఇవన్నీ కాదు గానీ, రేపు పెద్దమ్మగారినే అడుగుదామే. మీరే లక్ష్మిని పెళ్ళిచేసి గడప దాటించాలని చెప్దాం" అన్నాడు.

అరమోడ్పు కనులతో భర్త తల నిమిరింది రంగమ్మ. "అవునయ్యా, అదొక్కటే మనకున్న దారి" అన్నది. కించిత్తు ఆశా, ఒకింత సందేహమూ ఆమె మాటల్లో ధ్వనించినై.

తేలికపడిన మనసులు తనువుల్నీ సేదదీరమన్నాయి.

ఊసులాడి ఉసురుసులు సాగినై!

◇◇◇

సెప్టెంబర్ జరుగుతోంది. దసరా రాబోతోంది.

నవంబర్‌లో ముహూర్తం పెట్టించమని తొందరచేస్తోంది నరేందర్ తల్లి.

ఆవేళ సాయంత్రం -

అందరూ తీరుబడిగా హాల్లో కూర్చుని ఉన్నారు.

నరసయ్యా రంగమ్మా మొహామొహాలు చూసుకుంటూ, భాగ్యమ్మగారిని చూస్తూ చేతులు నలుపుకుంటూ నిలబడ్డారు.

వీళ్ళేదో తమలో తాము గుంజాటన పడుతున్నట్లు భాగ్యమ్మ కూడా అర్థం చేసుకుంది. "చెప్పండి" అన్నది.

పంకజమ్మా రంగమ్మ మొహం కేసి చూసింది.

రంగమ్మ పెదవి విప్పింది. "లక్ష్మినెలాగైనా మీరే..." అంటూ నీళ్ళు నమిలింది.

"అంటే...?" పంకజమ్మ గద్దించింది.

"పెళ్ళి ఖర్చు..." రంగమ్మ మాటలు పూర్తి చేయలేకపోయింది. నేలచూపు నిగిడ్చింది. నరసయ్య అదే స్థితిలో వున్నాడు.

భాగ్యమ్మ ముఖ కవళికలు మారినై.

తల్లి ఏం చెబుతుందా అని ఉత్సుకతతో చూస్తోంది పంకజమ్మ. నరసయ్యా, రంగమ్మా ఊపిరి బిగపట్టి నిలబడ్డారు.

క్షణం సేపు గంభీరంగా ఉండి, దిటవైన కంఠస్వరంతో అన్నది భాగ్యమ్మ. "అంటే, మీ బాధ్యతా, బరువూ మా మీద పెడుతున్నారా? ఏమనుకుంటున్నారే మీరు? ఏమిటీ చొరవా, తెగింపూ? మంచీ మర్యాదా ఉండక్కర్లే?"

"మేమిస్తే దాన్ని తీసుకోవటం వరకే మర్యాద. అంతేగానీ, బరితెగించి మీరే ఇట్టా అడగటం కుదరదు" పంకజమ్మ కూడా అంతే గట్టిగా అన్నది.

"నా మనసుకు నచ్చింది నేను చేస్తా. అంతే. గుర్తుంచుకోండి."

"అసలు మీరడగకూడదు. ఇచ్చింది తీసుకోవాలి. అంతే."

"ఎక్కడుండాల్సిన వాళ్ళు అక్కడుండాలి. అది మర్చిపోకూడదు"

నరసయ్యా, రంగమ్మా దిగ్భ్రాంతికి లోనయ్యారు. అమ్మా కూతురు మాటలు శూలాల్లా తగిలినై.

అదిగో - సరిగ్గా అప్పుడూ.

నరసయ్యకి కడుపు రగిలిపోయింది. రంగమ్మకీ మనసు కుతకుతలాడిపోయింది. ఇద్దరూ ఇలా జరుగుతుందని ఊహించలేదు. తల్లీ కూతురూ ఇలా మాటల ఈటెలు వదుల్తారనుకోలేదు.

- పన్నెండేళ్ళ చాకిరీకి ఇదా ఫలితం? ఎంత తేలిగ్గా తీసిపారేశారు ఇద్దరూనూ? రెక్కల కష్టానికి ఇదా వీళ్ళిచ్చే విలువ? ఇద్దరి కళ్ళల్లోనూ నీరు తిరిగింది.

ఆ కన్నీటి తెర మధ్యగా తమ ఉనికి ఏమిటో వారికి తెలిసొచ్చింది. పక్కకొచ్చేశారు. ముందుకు చూస్తే, నరసయ్యకి ట్రావెల్ ఏజెన్సీ కళ్ళ ముందు కనిపించింది.

రంగమ్మకి కాలనీలో వేరే ఇళ్ళూ, మనుషులూ కనిపిస్తున్నారు.

ఇద్దరి మనసుల్లోనూ కూతురి పెళ్ళికి చిట్టీల తాయారమ్మ మెదిలింది!

ఊరు విశాలంగా అనిపించింది.

గాలి చల్లగా ఆహ్వానిస్తోంది!!

✠

తెర తెరలో

శకుని మామ... సిఎస్సార్!

సిఎస్సార్‌ది మంచి విగ్రహం! అంతకన్నా మంచి గొంతు! మొదటి నాటకం 'రాధాకృష్ణ'లో ఏకంగా మొదటి పాత్ర శ్రీకృష్ణుడిదే! రాధగా వేసింది స్థానం వారు. వారిద్దరు కలిసి చాలా నాటకాలాడారు. 'సారంగధర, శ్రీకృష్ణ తులాభారం, చింతామణి' ఎంతో పేరు, కీర్తి సంపాదించి పెట్టిన నాటకాలు. కృష్ణుడిగా ఆయన గొంతెత్తి పాడే పద్యాలు వినడానికి జనం వెర్రిగా మైమరిచి పోయేవారట! 'చింతామణి'లో భవానీ శంకరుడి' పాత్రలో, 'తుకారాం'లో 'తుకారాం'గా ఆయన జీవించారు.

ఆ నాటకాలు అలనాడు అపురూపమైనవి. ఎంతో జనాదరణ పొందాయి. బళ్లారి రాఘవ అంతటి వాడు సిఎస్సార్ వేసిన రామదాసు పాత్రకు ముగ్ధుడైపోయాడు. - "నేను నీలా పాడలేను... ఇక నుంచి అది నీ పాత్రే... నువ్వే వేయాలి" అని ఎంతగానో మెచ్చుకున్నాడు.

అది ఆయన ప్రతిభకు మరో ప్రతిభావంతుడు అందించిన అపురూపమైన, ఆత్మీయమైన, అమూల్యమైన కితాబు. గొప్ప సర్టిఫికెట్. అనుమానం లేదింక.

డా॥ జె.పి. వైద్య

"మనస్యన్య ద్వచస్యన్యత్కార్యే చాన్యద్దురాత్మనామ్" అని హితోపదేశంలో ఉంది. "మనస్సులో ఒకటి, బహిరంగంగా పలికేది మరొకటి..." ఈ తత్వం దుష్టపాత్రలది.

జీవితంలో మనందరికీ ఎన్నో దుష్టపాత్రలు తటస్థపడతాయి. పలకరిస్తాయి. తల బొప్పి కట్టిస్తాయి. శాశ్వతంగా కూడా తల నొప్పి తెచ్చిపెడతాయి.

కానీ,

సినిమాల్లో, నాటకాల్లో 'దుష్టపాత్రలు' లేకపోతే ఎలా?

నాటకం రక్తి కట్టదు. సినిమా 'ఉస్సూరు'మంటూ సాగిపోతుంది.

అంతా కారం- ఉప్పు లేని చప్పిడి భోజనంలా!

'సమ్‌థింగ్ మిస్సింగ్' కదా!

సినిమా పిచ్చోళ్లకు సినిమాలో హీరో, హీరోయిన్ ఉండి - "వారు కలిశారు, చెట్టాపట్టాలేసుకుని తిరిగారు, హాయిగా మనకు నచ్చిన పాటలు పాడుకున్నారు. పెళ్లి చేసుకున్నారు. పిల్లాపాపలతో 'శుభం' అంటే

"-ఒర్నీయవ్వ! గిదేం సేన్మారా తమ్మీ! ఒక్క విలన్‌గాడు లేకపాయే... ఒక్క ఫైటింగ్ లేదు.... తన్నుకునుడు లేదూ... తన్నుడు లేదు... థూ! పైసలు దండగైపోయినై... జొగినీ? ఎవడురా భై సేన్మ తీసినోడు? జిందగీల మల్ల వాని సేన్మలు చూడకున్రి... పిసలేశి చస్తరు ఇంటర్వెల్ కంటే ముందే... థూ... చప్పటి సేన్మ మీద మన్ను పడ" అని మనస్పూర్వకంగా తెలిసిన తిట్లన్నీ ఆశీర్వాదంగా అర్పించి రావడం తప్పదు.

అందుకే పెద్దోళ్లు 'దుష్టపాత్రలు' సృష్టించారు. సినిమాల్లో 'అటాక్' 'కౌంటర్ అటాక్'లు వచ్చాయి. కొంతమంది దర్శకులు మరపురాని విధంగా దుష్టపాత్రలను పరిచయం చేశారు. కొందరు నటులు 'దుష్ట పాత్రలకు' ఎంత న్యాయం చేశారంటే ఆ పాత్రలు సజీవమై మనలాంటి రసిక ప్రేక్షకులను జీవితాంతం వెంటాడాయి, వేటాడాయి. పొరపాటుగా కూడా ఆ పాత్రల పేర్లను ఎవ్వరూ తన సంతానాలకు పెట్టుకోలేదు.

రాక్షసులూ, మాంత్రికులూ పోనీండి. దుర్యోధనుడు, శకుని లాంటి పేర్లు తమ పిల్లలకు ప్రేమతో పెట్టినవాళ్లున్నారా అసలు?

హిందీలో 'ప్రాణ్' పేరు చెప్తేనే పిల్లలు 'ఠక్కు'మని ఏడుపు ఆపేసేవారు.

'షోలే'లో 'గబ్బర్‌సింగ్' అభిమానంగా చెప్పుకున్నాడు - 'ఐదు కోసుల పరిధిలో పిల్లలు ఏడిస్తే తల్లులు చెవుల్లో గుసగుసగా చెప్పేవారు. 'ఏడవకు బుజ్జికన్నా... గబ్బర్ సింగ్ వచ్చేస్తాడు మరి' అని!

మన తెలుగు సినీ రంగంలో 'దుష్టపాత్రలకు'... పాత్రధారులకూ కొదవలేదు. ఈ పూట 'మాయాబజార్' లోని 'శకుని' పాత్రధారి

'సిఎస్సార్' గారిని తలచుకుందాం!

గమ్మత్తేమంటే - టీవీలోని బి.ఆర్. చోప్రా 'మహాభారత్'తో యావత్ భారతీయులకు 'మహాభారతం'లోని పాత్రల సముచిత పరిచయం జరిగింది. 'భాంజేcc' అంటూ మహాభారత్ లోని శకుని మెప్పించినట్టే 'మాయాబజార్'లోని సిఎస్సార్ శకునీ మెప్పించాడు. ఆ సిఎస్సార్ గారే బహుశా తెలుగు రంగస్థలపు తొలి కృష్ణుడి పాత్రలోనూ అంతే బలీయంగా వెలిగిపోయాడు.

రెండు సంపూర్ణమైన విరుద్ధ ధృవాల్లో అద్భుతమైన పాత్రపోషణ చేసిన ఖ్యాతి సిఎస్సార్‌ది. పూర్తిపేరు "చిలకపూడి సీతారామాంజనేయులు". నిజంగా ఆయన ఎంతో వైవిధ్య భరితుడైన నటుడు. నాలుగు దశాబ్దాల పాటు నాటక రంగంలోనూ, సినీ రంగంలోనూ వెలిగి తన ప్రత్యేకతను చెప్పకనే చాటుకున్న నటుడు సిఎస్సార్.

సాధారణంగా సినీ రంగంలో 'విరుద్ధ దిశల పాత్రలు' వేసేవారు చాలా తక్కువే! ఎన్టీఆర్ గురించి విశదీకరించి చెప్పాలంటే మహా గ్రంథమే అవుతుంది. ఆయన ఆల్‌టైం గ్రేట్. అందులో ఏ మాత్రం సందేహం లేదు. తనదంటూ ప్రత్యేకమైన అనునాసికమైన 'డైలాగ్ మాడ్యులేషన్' సిఎస్సార్ 'ఖాస్‌బాత్'గా భావించాలి. ఎంతో విశిష్టంగా సాగి పోయేది వారి 'డైలాగ్ డెలివరీ'. అలా అనుకరించడం మిమిక్రీ ఆర్టిస్టులకే సాధ్యం కాబోలు.

గుంటూరు జిల్లాలోని 'నరసరావు పేట'లో 1907 జులై11న జన్మించిన సిఎస్సార్‌కు నాటకాల పిచ్చి ఉండేది. ఆ రోజుల్లో దాదాపు అందరూ నాటక రంగం నుండే అంచెలంచెలుగా ఎదిగి సినిమా రంగాన్ని అందుకున్నవారు, అదరగొట్టిన వారు కూడా! ఆయన తండ్రికి జ్యోతిష్యంలో ప్రవేశం ఉండేది. తనయుడు గొప్ప నటుడవుతాడన్నది ఆయన దృఢ విశ్వాసం. అందుకే నాటకాలాడ్డే పనికట్టుకుని అడ్డుకోలేదెన్నడూ!

సిఎస్సార్‌ది మంచి విగ్రహం! అంతకన్నా మంచి గొంతు! మొదటి నాటకం 'రాధాకృష్ణ'లో ఏకంగా మొదటి పాత్ర శ్రీకృష్ణుడిదే! రాధగా వేసింది స్థానం వారు. వారిద్దరూ కలిసి చాలా నాటకాలాడారు. 'సారంగధర, శ్రీకృష్ణ తులాభారం, చింతామణి' ఎంతో పేరు, కీర్తి సంపాదించి పెట్టిన నాటకాలు.

కృష్ణుడిగా ఆయన గొంతెత్తి పాడే పద్యాలు వినడానికి జనం వెర్రిగా మైమరిచి పోయేవారట! 'చింతామణి'లో భవానీ శంకరుడి' పాత్రలో, 'తుకారాం'లో 'తుకారాం'గా ఆయన జీవించారు.

ఆ నాటకాలు అలనాడు అపురూపమైనవి. ఎంతో జనాదరణ పొందాయి. బళ్లారి రాఘవ అంతటి వాడు సిఎస్సార్ వేసిన రామదాసు పాత్రకు ముగ్ధుడైపోయాడు. - "నేను నీలా పాడలేను... ఇక నుంచి అది నీ పాత్రే... నువ్వే వేయాలి" అని ఎంతగానో మెచ్చుకున్నాడు.



అది ఆయన ప్రతిభకు మరో ప్రతిభావంతుడు అందించిన అపురూపమైన, ఆత్మీయమైన, అమూల్యమైన కితాబు. గొప్ప సర్టిఫికెట్. అనుమానం లేదింక.

గురజాడ అప్పారావు గారి మహోన్నత కృతి 'కన్యాశుల్కం'. అందులో గిరీశం పాత్రకు సిఎస్సార్ గారు జీవం పోశారని చెప్పుకుంటారు. ఈ తరం వారికి బహుశా ఆ విషయం తెలియక పోవచ్చు.

కొన్ని పాత్రల్లో ఆయన అమరుడైపోయాడు. 'శ్రీవెంకటేశ్వర మహత్యం' (1935)లో శ్రీవెంకటేశ్వర స్వామి పాత్ర, 'పాదుకా పట్టాభిషేకం'(1932) లో శ్రీరాముడి పాత్ర ఆయనకు ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టాయి.

అప్పులు చేస్తే ఎన్ని తిప్పలో తేల్చి చెప్పిన 'అప్పు చేసి పప్పు కూడు' లోని 'రావు బహదూర్ రామదాసు పాత్ర కలకాలం 'నవ్వుల పువ్వులు'గా జ్ఞాపకం ఉండి పోయే పాత్ర.

'రోజులు మారాయి'లో 'ఏరువాక సాగారో' పాటకు పదన్యాసం చేసిన 'వహీదా రెహ్మాన్'తో పాటు 'జమిందార్ సాగరయ్య'గా పాత్ర పోషణ చేసిన సిఎస్సార్ ఎందరికి జ్ఞాపకం ఉన్నాడో తెలియదు. "పరమానందయ్య శిష్యుల కథ"లో (1950) పరమానందయ్యగానూ, 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో 'శ్రీకృష్ణుడిగానూ, 'మాయారంభ' లో 'నారదుడి'గా ఎందరినో అలరించారు.

'నిత్య కళ్యాణం పచ్చతోరణం' - 'సౌదామిని' -'అంతా మనవాళ్లే' - ' ఎత్తుకు పైఎత్తు' - 'రత్నమాల' - 'లైలా మజ్ను' - 'ప్రేమ' - 'పాతాళ భైరవి' - ' భక్త కుచేల' లోని ఆయన పాత్రలు జన రంజకాలై కలకాలం నిల్చిపోయాయి.

నాలుగు దశాబ్దాల పాటు జనరంజకంగా అటు నాటక రంగాన్నీ , ఇటు సినీ రంగాన్ని ఏలిన సిఎస్సార్ ఆంజనేయులు అక్టోబర్8, 1963నాడు తిరిగి రాని దూరతీరాలకు పయనమైపోయారు.

ఈతరం సినీ రసికులకు సిఎస్సార్ తెలియకపోవచ్చు.

ఓపిక చేసుకుని 'దేవదాసు' లేదా 'మాయాబజార్' ను మరోసారి చూడండి.

'దేవదాసు'లోని నాగేశ్వరరావు గారు అందరికీ తెలుసు. సావిత్రి భర్తగా వేసిన వృద్ధ జమిందార్ పాత్రలో సిఎస్సార్ పలకరించిపోతారు. 'మాయాబజార్' గురించి ఇదివరకు వరుసగా మూడు వారాలు రాశాను. అది చదవని వారుండొచ్చు. కానీ, మాయాబజార్ చూడని వారు ఉంటారా? మళ్లీ ఓపిగ్గా చూడండి.

'పాండవులు లేకున్నా పాండవులు మన వెంట ఉన్నట్టే తలపించిన అపూర్వ కళాఖండం 'మాయాబజార్'. తెలుగు వారి పాలిట సినీ కల్పవృక్షం అది. ఏయన్నార్, యన్టీఆర్, సావిత్రి, గుమ్మడితో పాటు 'ఒన్ అండ్ ఓన్లీ' 'యస్వీ రంగారావు' ఘటోత్కచుడిగా కనువిందు చేస్తారు. కానీ, మొహం వంకర చేస్తూ, దుర్యోధనుడి చెవులూ, కురువృద్ధుల మెదడూ తిని పారేసిన 'శకుని మామ'ను చూసి - 'అరేయ్! తమ్మీ! మన తెలుగోళ్లు చిన్నోళ్లు కారు బిడ్డా' అని మనం మురిసిపోతాం! మనం దర్దీ రసికులం...! వూరికే మెరిట్ సర్టిఫికెట్లు ఇచ్చి 'గుడ్...గుడ్....' అనడానికి మనం వెర్రిబాగుల ప్రింటింగ్ ప్రెస్ వాళ్లమా ఏమిటీ?

✠

చూద్దామా...

మన నయాగరా 'జోగ్ ఫాల్స్'



పెబర్నాడు నుండి పొద్దున్న బయలుదేరితే రాత్రయింది 'షిమోగా' చేరడానికి! గెస్ట్‌హౌస్ బుక్‌చేసి ఉంచారు. కరెక్ట్‌గా జోగ్‌ఫాల్స్ ఎదురుగానే ఉందా గెస్ట్‌హౌస్. విపరీతమైన గాలి...హెూరుమని నీళ్లు పడుతున్న శబ్దం...వింటుంటేనే వెళ్లి చూసెయ్యాలనిపించింది. కానీ చీకట్లో ఏమీ కనిపించదని ఆగాం. గెస్ట్‌హౌస్‌లోనే భోజనాలు రెడీ చేయమని ఒక హెూటల్‌వారికి చెప్పడంతో వారు భోజనం సిద్ధంగా ఉంచారు. హెూటలంటే పెద్దగా ఊహించుకోకండి. మన కిరాణాషాపులుంటాయే, అలా వరసగా ఉన్నాయి. రెండు టేబుల్స్, ఎనిమిది కుర్చీలతో సింపుల్‌గా ఉంది. కానీ రుచి అద్భుతంగా ఉంది. అప్పటిదాకా ఏది దొరికితే దాంతో కడుపునింపుకున్న మేం ఆ రాత్రి విందుభోజనం ఆరగించాం. సుష్టుగా తిన్నాక పొద్దున్నే లేవాలనుకుంటూ పడుకున్నాం. తెలతెలవారేసరికల్లా రెడీ అయిపోయి జలపాతం ముందున్నాం.

అరుణ.కె

వర్షాలు బాగా పడుతున్న సమయంలో జలపాతంలోని నీరు ఉధృతంగా పడుతుంది. మహానది పరవళ్లు తొక్కుతూ అంతెత్తునుండి ఉప్పొంగి ఉరుకుతుందా అన్నట్లుంటుంది. కానీ మేమెళ్లింది అక్టోబరులో! అందుకనే అంత నీరు లేదు. అలాగని జలపాతం లేదనుకోకండి. తక్కువగా నీరు పడుతుంటేనే ఇంత శబ్దం వస్తుందే, ఇక ఆ సమయంలో ఇక్కడెలా ఉంటుందో అనుకున్నాం. రుతువులను బట్టి అక్కడ జలపాతపు పరవళ్లు ఉంటాయన్నమాట!

దీనికి ముందు జలపాతం గురించి కొన్ని సంగతులు చెప్పాలి. ఈ జలపాతం కర్నాటకలోని షిమోగా జిల్లాలో ఉంది. దీనికి 'గెరుసొప్పె', 'జాగడ గుండి' అనే పేర్లున్నా జోగ్ ఫాల్స్ అన్నదే బాగా ప్రాచుర్యం పొందింది. ఈ జలపాతంలో ఉరుకుతున్నది 'షెరావతి' నది తాలూకు నీరు! జలపాతం ఎత్తు సుమారు వెయ్యి అడుగులు. భారతదేశంలో అతి ఎత్తైన, ఆసియాలో రెండవ ఎత్తైన జలపాతం. అంత ఎత్తైన జలపాతానికీ కిందదాకా మెట్లున్నాయి! పైనుండి చూస్తుంటే లోయ కిందున్న మనుషులు చీమల్లా కనిపించారు. మరి మీరు కిందదాకా దిగలేదా? అని అనుకుంటున్నారా? మనకంత ఓపిక లేదండీ బాబూ! దిగుతాం సరే! తర్వాత మళ్లీ ఎక్కాలికదా అనుకునేసరికి ఉత్సాహమంతా నీరుగారిపోయింది. ఐదంతస్థులంత దిగి ఫోటోలు తీసుకుని పైకెక్కేశాం.

నయన మనోహరం ఆ దృశ్యం

తెలతెలవారుతుండగా జలపాతం దగ్గరికెళ్లాంకదా! జలపాతం పడుతున్న ఆ లోయలో ఒక పక్షుల గుంపొకటి విహారానికొచ్చింది. చల్లనిగాలి వీస్తుంటే, చుట్టూ జలపాతపు నీరు పడుతుంటే...ఆ పక్షులు ఆ చివరనుండి ఈ చివరివరకు, ఈ చివరనుండి ఆ చివరివరకూ గింగిరాలు తిరుగుతూ హాయిగా ఎగురుతుంటే ఎంతందంగా ఉందనుకున్నారు? వర్ణించతరం కాదు. ఆహా! ఏమి వాటి అదృష్టం అనిపించింది. స్వచ్ఛమైన గాలి పీలుస్తూ, అంత ప్రశాంతమైన వాతావరణంలో అందాలు వీక్షిస్తూ అలా ఎగరడం మనకు సాధ్యపడే విషయమేనా? ఆ పక్షులెంత మానసికోల్లాసాన్ని మూటకట్టుకుంటున్నాయో! అందుకే ఆ పక్షులను చూస్తుంటే ఆహా, ఎంత ఆహ్లాదకరమైన, నయన మనోహరదృశ్యమో కదా అనిపించింది. అవి ఉన్నంతసేపూ కళ్లార్పకుండా చూస్తూ ఉండిపోయాం.

రాజా, రాణీ...

ఈ జలపాతం నలుదిక్కులకూ ఉంటుంది.



నాలుగు పాయలుగా జలపాతం పడుతూ ఉంటుంది. నాలుగింటికీ నాలుగు పేర్లున్నాయి. వాటిలో మొదటిది 'రాజా'. ఇది చూడటానికి హుందాగా, దర్జాగా ఉంటుంది. రెండవది 'రోరర్'- ఇది జారుడుబండలాంటి రాళ్ల మధ్యనుండి హెూరుమని శబ్దం చేసుకుంటూ ఉరుకుతుంది. మూడవది 'రాకెట్'- చిన్న మార్గంగుండా లెక్కలేనంత నీటిని వాయువేగంతో పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. నాలుగవది 'రాణి'- చెప్పక్కర్లేదుగా! ఒంపుసొంపులతో, రాళ్లమధ్యనుండి మందగమనంతో హెుయలుపోతూ సుతారంగా జాలువారుతుంది. ఈ నాలుగింటినీ ఒక వైపునుండే కాక, అన్నివైపులనుండి వీక్షించవచ్చు. ప్రతీ పాయ దగ్గరికి వెళ్లొచ్చు. అంటే నడిచెళ్లే దూరం కాదు. చుట్టు తిరిగెళ్లాలి. ఒక పాయ దగ్గరికెళ్లామంటే ఆ పాయ అందాన్ని దగ్గరినుండి వీక్షించడంతో పాటూ, మిగతా పాయల అందాన్ని దూరంనుండి చూడొచ్చు. అన్నిటికన్నా రాణి దగ్గర ఇక కొద్ది దూరంలో నీళ్లు పైనుండి కిందకు పడ్తాయి. అక్కడ దిగి నీళ్లల్లో ఆడుకోవచ్చు.

హేట్సాఫ్ టు షెరావతి!

ఇంత జలపాతానికి కారణమైన షెరావతినది గొప్పదనాన్ని చెప్పుకోకుంటే ఎలా? మీకు తెలుసా? షెరావతినది నీటిని ఎక్కడా పంటపొలాలకు, తాగునీటికీ వినియోగించరు. కేవలం విద్యుత్ ఉత్పత్తికే వాడతారు. ఈ నది 'తిరుత్తహళ్లి'లో పుట్టింది. ఈ నది పుట్టిన ప్రదేశంనుండి, సముద్రంలో కలిసేవరకూ అనేక డ్యామ్‌లున్నాయి. ప్రతీ డ్యామ్ దగ్గరా విద్యుత్తును ఉత్పత్తి చేయడమే! షిమోగాలో మరీ ఆశ్చర్యం! 1960లో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య షిమోగాలో 'లింగన్‌మక్కి డ్యామ్' నిర్మించారు. ఈ డ్యామ్ వద్ద విద్యుత్ ఉత్పత్తయిన తరువాత అక్కడనుండి నీరు మరో జలాశయానికి చేరుతుంది. అక్కడ మరలా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. అక్కడనుండి నీళ్లు జోగ్ జలపాతంలోనికి వస్తాయి. అంటే ఆ ప్రదేశంలో రెండుచోట్ల విద్యుతుత్పాదన అవగా వచ్చిన నీరు ఈ జలపాతంలో ఉవ్వెత్తున ఉరికిపడే నీరన్నమాట!

అంతకుముందు ఆయన ఒకసారి లింగన్‌మక్కి డ్యామ్‌ను సందర్శించినపుడు ఇంత నీరు వృధాగా పోతుందని బాధపడి అక్కడ డ్యామ్‌లు నిర్మించేలా కృషి చేశారట. ఆనాటి మనుషుల్లోని ఆలోచన, భవిష్యత్ తరాలకోసం తపన చూశారా! అంతకుమించి ఇంత ప్రయోజనాన్ని ఆశించి విశ్వేశ్వరయ్యగారు వీటిని నిర్మింప తలపెట్టినా నాటి నాయకులు దానికి ఒప్పుకోవడం! ఇప్పుడు స్వలాభం తప్ప దేశ పురోగతి ఎవరికి పట్టింది? ఆ కథంతా వివరిస్తూ "మనుషుల్లో టెక్నాలజీ పెరిగింది కానీ, చిత్తశుద్ధి కొరవడింది. డబ్బు సంపాదనపై యావ తప్పించి చేసేపనిని సవ్యంగా చేయాలన్న ఆలోచన ఉండటం లేదు. అందుకే ఆనాడు కట్టిన డ్యామ్ ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంటే నేటి ప్రాజెక్టులు పూర్తి కాకమునుపే కూలిపోతాన్నాయి" అని అన్నారు చీఫ్ ఇంజనీర్ షెనాయ్. ఈ మాటలనేప్పుడు ఆయన గొంతులో ఒక రకమైన ఆర్ద్రత కనిపించింది.

మాటలకందని పారవశ్యం

లింగన్‌మక్కి డ్యామ్‌నుండి వచ్చిన నీరు ఒక జలాశయంలోకి వెళ్తాయని ముందే చెప్పుకున్నాం కదా. ఆ జలాశయం మానవనిర్మితం. అంటే అక్కడొక డ్యామ్ కట్టడంతో అక్కడి కొండలన్నీ మునిగిపోయి 260 అడుగుల లోతున జలాశయం సృష్టించబడింది. అంతా మనిషి మాయాజాలం! ఇక కొండల పైభాగం ఉంటుంది కదా! అవన్నీ ఈ జలాశయంలో చిన్న చిన్న దీవుల్లా కనిపిస్తాయి. వాటినిండా దట్టంగా చెట్లు పెరిగి చిన్నపాటి అడవుల్లా తయారయ్యాయి. అలాంటి దీవుల మధ్య ఆ జలాశయంలో జలవిహారం చేశాం. అలాంటి సమయంలో లాహిరి లాహిరి పాట గుర్తురాకుంటే మనమసలు తెలుగువారమే కాదు. సో, మాక్కూడా ఆ పాట గుర్తుకొచ్చింది. చల్లని పిల్లతెమ్మెర మెలమెల్లగా తాకుతుంటే...నీరెండ చురుక్కుమని గుచ్చుతుంటే...చిరుగాలికి చిన్ని అలలు





తెరలుతెరలుగా గలగలమంటుంటే...ఆ విహారం వింత పరవశాన్ని మదిలో నింపింది. ఆనందడోలికలు ఊగించింది. కదిలితే పడవ మునిగిపోవచ్చని బెదిరించడంతో అటూఇటూ కదిలితే ఒట్టు. ఆ చిన్నపాటి భయం మనసులో బెరుకు కలిగించినా, ప్రకృతి ఒడిలో సేదతీరటంలో మునిగిపోయి ఆ భయాన్ని మర్చిపోయాం.



వింతనిపించిన సంగతేమిటంటే...ఆ కొండల్లో గిరిజనులు నివసిస్తారంట! పనులకోసం పడవలపై ఇవతలికొచ్చి, మళ్లీ కొండల్లోకి వెళ్లిపోతారట! మూలాలను వదల్లేని ప్రేమ ఇంకా అక్కడే ఉండనిస్తుందో లేక మన స్వార్థం వారినలా మగ్గనిస్తుందో? ఈరోజుల్లో కూడా ఇంకా అలాగే జీవనం వెళ్లబుచ్చుతున్నారంటే అది వారి నిస్సహాయతా, మనలో ఇమడలేని తత్వమా? వారి వనరులన్నీ వాడుకుంటూ కూడా వారికి సరైన జీవనభృతిని కల్పించలేని మన నిర్లిప్తత? అక్కడే కాదు, ప్రాంతం ఏదైనా ప్రతీ గిరిజనుడు ఎదుర్కొంటున్న సమస్యే ఇది! ఇది వింటుంటే మీకు పోలవరం ప్రాజెక్ట్, అక్కడి గిరిజనుల పోరాటం గుర్తురావడం లేదూ?

పైనాపిల్, పెంకుటిల్లు...

మధ్యలో ఒకచోట పైనాపిల్ కాయలు కనిపించాయి. చక్కగా పండి, పెద్దగా ఆరెంజి రంగులో మంచి వాసనొస్తున్న వాటిని చూడగానే కొనాలనిపించింది. అడిగిచూస్తే ఒక్కొక్కటీ డెబ్భై రూపాయలు చెప్పారు. బేరమాడీ ఆడీ రెండు ఎనభైకి కొన్నాం. తిన్న తరువాత వాటికంత పెట్టడంలో తప్పులేదనిపించింది. అంత తియ్యగా ఉన్నాయవి. మామూలుగా తింటే నోరంతా కొట్టుకుపోతుంది కదా! పక్వానికొచ్చిన కాయ కావడంవల్లో ఏంటో అలా అనిపించలేదు.

ఇంకొక సంగతి చెప్పాలి! కర్నాటక మొత్తంలో ఎన్ని పెంకుటిళ్లు కనిపించాయో చెప్పలేము. దారంతా పెంకుటిళ్లు, అవికూడా మండువా ఇళ్లు. ఎంత బావున్నాయో తెలుసా? ఎండాకాలంలో చల్లదనాన్ని, వానాకాలంలో సులువుగా నీరు జారడానికి అనువుగా ఉంటాయి పెంకుటిళ్లు. అది పల్లె అయినా, పట్నమయినా కాస్త జాగా దొరికితే చాలు, డాబా లేపేయ్యాలనే ఉంటుంది ఎవరికైనా. ఇక్కడ మనకు స్టైలే ప్రధానం. అంతేకానీ అసలు ఏది మన వాతావరణానికి వీలుగా ఉంటుందో ఆలోచించని నేటి రోజుల్లో ఇంకా పెంకుటిళ్ల సాంప్రదాయాన్ని వదలలేని వీరిని చూస్తే ముచ్చటేసింది.

అసలు మన దేశంలోనే ఎన్నో అందమైన ప్రదేశాలున్నాయి. అయినా మనం అడుగు ముందుకేయం. అదే విదేశీయులైతే చిన్న నిక్కరు, టీషర్టు(ఆడైనా, మగైనా) వేసుకుని, చిన్న సంచి భుజాన తగిలించుకుని సిద్ధమైపోతారు (కాకుంటే వారి దగ్గర దండిగా ప్లాస్టిక్‌మనీ ఉంటుందనుకోండి)! ఇన్ని ప్రదేశాలు, ఇన్ని అందాలు విదేశీయులు ఎగబడి చూస్తుంటే...మన దేశంలో ఉంచుకుని మనం చూడలేకపోవడమేంటి? మనమూ కొంత తెగింపు కావాలి. ఖర్చు ఉంటుంది, దానికితోడు తీరిక చిక్కాలి. కాకుంటే ప్లానింగ్ సరిగా ఉంటే తక్కువ ఖర్చులో ప్రదేశాలు చుట్టి రావచ్చు. ఒక వారం రోజుల విహారం ఏడాది పొడుగునా మనసుకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తుందంటే మనిషికి అంతకంటే బలం, ఆరోగ్యమేముంది?

ఏదో ఏదో అన్నది...

ఏమైనా పడమటి కనుమల్లో, చిక్కని అడవుల్లో వంపులు తిరిగిన వడ్డాణంలా ఒదిగిపోయిన జోగ్‌ఫాల్స్ సందర్శించడం అందమైన అనుభూతి! జోగ్‌ఫాల్స్ మనదేశంలోని నయాగరా అని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఇక్కడి పచ్చని వనాలు, ప్రకృతి శోభ, స్వచ్ఛమైన గాలి, కల్మషమెరుగని మనుషులు...అన్నీ మనల్ని ఆకట్టుకుంటాయి. వర్ణరంజితమైన భువనైక స్వర్గంలో మనల్నీ ఇముడ్చుకుంటాయి. అక్కడ చూసినన్ని పూలు ఇంకెక్కడా చూసి ఉండం! దారంతా పేరు తెలియని రకరకాల పువ్వులు చిరుగాలికి అల్లల్లాడుతుంటే అందుకోవాలనుకోని అతివ ఉండదంటే అతిశయోక్తి కాదేమో!

ట్రిప్ పూర్తయ్యి రొటీన్ జీవితంలో పడిపోయినా; ఆ కొండాకోనలు గుర్తొస్తే మనసుకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతున్నట్లవుతుంది. గుర్తొస్తే చాలు ఉత్తేజం వస్తుందంటే అదే ప్రకృతి గొప్పదనం! దాన్ని నాశనం చేసుకోకుండా కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు బతుకైనా, భవితైనా! ఆస్తులు, అంతస్థులే కాదు, ప్రకృతిని భద్రంగా అందజేయాల్సిన బాధ్యత మనపై ఉందని తిరిగొచ్చాక ఈ కాలుష్యంలో మగ్గుతుంటే అర్థమైంది. బహుశ ఆ చిత్తడి నేల, చల్లని గాలి, ఉరికే నీరు, తలూపే తరులు, విరులు చెప్పిన సందేశం ఇదేనేమో!



బొద్దు ముద్దే కానీ...



పిల్లలు బొద్దుగా వుంటే చూడగానే ముద్దొస్తారు. ఇందులో అక్షరం కూడా అసత్యం లేదు. అందుకు నిదర్శనం ఈ పిల్లలే. చూడండి వెంటనే ఎత్తుకొని ముద్దాడాలనిపిస్తున్నారా లేదా! బుగ్గలు పట్టుకుని లాగాలనిపిస్తోందా లేదా? అయితే అలా వదిలేస్తే... వారు కాస్తా స్థూలకాయులుగా మారే అవకాశాలు వందకు నూరు శాతం వుంటాయి. ఇహ అప్పుడు చూడండి కూర్చోలేరు. నిలబడలేరు. ఏది చెయ్యాలన్నా యాతనే. అందుకే డియర్ మామ్స్! మీ ప్రేమనంతా రంగరించి ఆహారపదార్థాల రూపంలో పిల్లల నోళ్లల్లో కుక్కకండే.



అమ్మా...!

ఎంతైనా తల్లి మనసు తల్లి మనసే. నరులైనా ! వానరాలైనా!! చూశారుగా!!! తన చిన్నారి మారుతిని వీపు మీద ఎక్కించుకొని తల్లి వానరం బయలుదేరింది. మార్గమధ్యలో రద్దీ రోడ్డు వచ్చింది. పాపం పిల్ల కంగారుపడి...కింద పడిపోయింది. సరిగ్గా ఆ సమయంలో ఎక్కడినుంచి ఊడిపడిందో కాలయముడిలా శునకం ఒకటి వచ్చి మారుతిని అడ్డగించింది. అంతే వీరావేశంతో ఊగిపోయిన పెద్ద కోతి ... కుక్కను తరిమి తరిమి కొట్టింది. బిడ్డను అక్కున చేర్చుకొంది. హేట్స్ ఆఫ్ టు మదర్ మంకీ అంటరా!

పరీక్ష

-సాహిల్.కె

మాధవ పుర రాజు కార్తీకుడు. తెలివిగలవాడు. దయగలవాడు. పేద ప్రజలంటే ఎంతో జాలి, ప్రేమ, అభిమానం. వారి కోసం ఏం చేయడానికైనా వెనుకాడనివాడు. అతనికి ఒక్కడంటే ఒక్కడే కొడుకు. కుటుంబానికి దూరంగా మాంచి గురువుగారి వద్ద విద్యనభ్యసిస్తున్నాడు. ప్రజలందరికీ కార్తీకుడంటే దేవుడితో సమానం. అతనికోసం ఏం చేయడానికైనా సిద్ధపడేవారు. అతని పాలనలో వానలు సకాలంలో కురిసేవి. ప్రకృతి వైపరీత్యాలనేవే తెలిసేవి కాదు. పొలం నిండా పైరు...చేతి నిండా పంటగా వుండేది రైతుల పరిస్థితి. దాంతో సహజంగానే మిగతా వృత్తుల వారి పని కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా వుండేది. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించాల్సిందేనన్నది ఆయన తత్వం.

ఓరోజు తన ప్రియశిష్యుడైన కార్తీకుడు రాజ్యపాలన ఎలా చేస్తున్నాడో చూద్దామని వస్తాడు రాఘవేంద్రముని. ఆయన గొప్ప తపస్వి. వేదముల నుంచి యుద్ధవిద్యల వరకు అన్ని రంగాలలోను ఆరితేరినవాడు. కార్తీకుడు గురించి ఆనోట ఈనోట విన్నదంతా నిజమో కాదో తెల్సుకోవాలనుకుంటాడు. వెంటనే రాజాస్థానంలోకి ప్రవేశిస్తాడు. అక్కడ కార్తీకుడు మంత్రులతో, అధికారులతో కొలువు తీరి వుంటాడు. ఆ సమయంలో విచ్చేసిన తన గురువుగారిని సాదరంగా ఆహ్వానించి ... సకల మర్యాదలు చేసి...కుశల ప్రశ్నలు వేసి... ఉచిత ఆసనంలో ఆశీనులు కమ్మంటాడు. తర్వాత కాసేపటికి మెల్లగా అసలు విషయం మొదలెడతాడు ముని.

"కార్తీకా! నీ పుత్రుడు ఎలా చదువుతున్నాడు? ఎక్కడ వున్నాడు?" అనడుగుతాడు. బుద్ధిగా చదువుకుంటున్నాడని చెప్తాడు కార్తీకుడు.

దానికి ముని ఉగ్రుడై..."నువ్వు ఇక్కడ రాజ్యపాలనలో తలమునకలై వుంటే నీ పుత్రుడు అక్కడ తన ఇష్టానికి వచ్చినట్టు ప్రవర్తిస్తున్నాడు. తన సహ విద్యార్థితో గొడవపడి ప్రాణాలు తీసేశాడు...మరి దీనికి ఏం న్యాయం చెప్తావు?!" అనడుగుతాడు.

కార్తీకుడు మొదట హతాశుడైనా...తర్వాత నెమ్మదిగా..."గురువర్యా! నా కుమారుడి గురించి పూర్తిగా తెలుసనుకుంటున్నాను. వాడి స్వభావం అలాంటిది కాదని నాకు గట్టి విశ్వాసం. ఒకవేళ అదే నిజమైతే వాణ్ణి ఉరితీయిస్తాను. వాడి వలన ఓ కుటుంబానికి అన్యాయం జరగనివ్వను. వాడు పదిరోజుల్లో రాజ్యానికి రానున్నాడు. అప్పటివరకు మీరు ఇక్కడే విశ్రాంతి తీసుకోండి" అంటాడు.

కానీ ముని అప్పటివరకు ఆగలేనంటాడు. వెంటనే రాకుమారుణ్ణి రప్పించి నిజానిజాలు తేల్చాల్సిందేనని పట్టుపడతాడు. దాంతో సరేనంటాడు రాజు. ఆయన ఆజ్ఞ మేరకు భటులు రాకుమారుణ్ణి తీసుకుని బయలుదేరతారు. అయితే మార్గమధ్యలోనే ముని వారిని అటకాయించి రాకుమారుడితో మాట్లాడతాడు. ముని గురించి తెల్సిన రాకుమారుడు ఆయన చెప్పినదానికి సరేనంటాడు. తర్వాత యధాప్రకారం భటులతో కలిసి రాజభవనం చేరుకుంటాడు.

మరుసటిరోజు సభ మొదలౌతుంది. ఏం జరుగుతుందో, రాజు ఏం తీర్పు ఇస్తాడోనని జనం తండోపతండాలుగా వస్తారు.

విచారణ మొదలౌతుంది. రాకుమారుడని కూడా చూడకుండా సాధారణ వ్యక్తిని ప్రశ్నించినట్టు బోనులో నిలబెట్టి అడిగారు రాజుగారు.

"నిజమేనా మునివర్యులు చెప్పింది? నువ్వు నీ సహవిద్యార్థిని చంపావా?"

"నిజమే!"

"ఎందుకు చేశావా పని!"

"వాడు నాతో పోటీ పడ్డాడు. పోటీలో వాడు గెలిచాడు. నేను ఓడిపోయాను. అది తట్టుకోలేక ...ఆ పని చేశాను"

"నీకు ఒక సామాన్యుడికి వుండవలసిన ఓర్పు, సహనం కూడా లేదు. ఇంక ఈ రాజ్యానికి రాజుగా ఏంపనికొస్తావు? నీవు చేసిన తప్పుకు ఉరిశిక్షే సరైనది. వెంటనే అమలు చేయండి" అంటూ అక్కడినుంచి వెళ్లడానికి లేస్తాడు. అప్పుడు ముని లేచి... చప్పట్లు చరుస్తూ... "శభాష్ శిష్యా! తన మన లేకుండా నువ్వు చెప్పిన న్యాయం చూసి నేను చలించిపోయాను. నువ్వు ఈ సింహాసనం మీద వున్నంతకాలం దేశ ప్రజానీకానికి ఎటువంటి ధోకా వుండదు. అసలు నీ కుమారుడు ఎటువంటి హత్య చేయలేదు. నువ్వు న్యాయాన్ని చట్టాన్ని ఎలా కాపాడుతున్నావో పరీక్షించేందుకే ఇదంతా చేశాను. మొదట అందుకు నన్ను క్షమించు" అంటూ అసలు విషయం చెప్తాడు. అప్పుడు రాజు ఎంతగానో సంతోషించి...

"నాకు తెలుసు మునివర్యా. నా కుమారుడు అలాంటి పని చేయడు. ఆ ధీమా నాలో వుంది" అంటూ కుమారుణ్ణి ప్రేమగా కౌగలించుకుంటాడు.

సభికులంతా తమ ఆనందాన్ని హర్షధ్వానాల ద్వారా తెలియచేస్తారు.